

ఏలూరులో బుధవారం రాత్రి కురుస్తున్న భారీవర్షం

ఒకవైపు వర్షం.. మరోవైపు ఉక్కపోత

- నైరుతి రుతుపవనాలు వచ్చినా విభిన్న వాతావరణం
- గడచిన 24 గంటల్లో ముదినేపల్లిలో 135.8 మి.మీ వర్షపాతం



ఎండ ధాటికి గురువారం నిర్మానుష్యంగా పాలకొల్లు బస్టాండ్ రోడ్డు

ఏలూరు సిటీ, జూన్ 6 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో బుధవారం రాత్రి కుంభ వృష్టిగా వర్షం కురిసింది. మరునాడు గురువారం ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెంటీ గ్రేడ్ మాత్రమే నమోదైనా ఉక్కపోత విపరీతంగా ఉంది. గురువారం రాత్రి 8 గంటల వరకు అందిన సమాచారం మేరకు ఎక్కడా వర్షం కురవలేదు. ఒక పక్కన నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొని ఉంది. బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన వర్షాలు రాత్రి 9 గంటల నుంచి ఏకధాటిగా పలు ప్రాంతాల్లో కుండపోతగా కురిశాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏలూరులోని కొన్ని ప్రాంతాల్లో గురువారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 135.8 మిల్లీమీటర్లు (13.5 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైంది. నైరుతి ప్రవేశించిన రోజునే అత్యధికంగా వర్షపాతం నమోదు కావడం గమనార్హం. జిల్లాలో సరాసరి వర్షపాతం 46.7 మి.మీగా నమోదైంది. మండవల్లిలో 109.8, ముసునూరు 104.6, కొయ్యలగూడెం 102.4, చింతలపూడి 87.4, కైకలూరు 80.2, లింగపాలెం 73.2, నూజివీడు 72.8, ఏలూరు అర్బన్ 60.4, పెదపాడు 58.4, దెందులూరు 54.2, కలిదిండి 53.6, పెదవేగి 48.4, భీమడోలు 40.6, ఏలూరు రూరల్ 37.4, ఉంగుటూరు 36.6, జంగారెడ్డిగూడెం 34.8, పోల వరంలో 25, కామవరపుకోటలో 24.6, టి.నరసాపురం 18.4, ద్వారకా తిరుమల 11, బుట్టాయిగూడెం 8, నిడమర్రు, కుక్కునూరులలో 7.8, ఆగిరిపల్లి 5.8, జీలుగుమిల్లి 4.8, చాట్రాయి 3.2 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

ముగిసిన ఎన్నికల కోడ్

ఏలూరు సిటీ, జూన్ 6 : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును నిలుపుదల చేస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. మార్చి 16వ తేదీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి కోడ్ అమల్లోకి రాగా ఎన్నికల ప్రక్రియ ముగియడంతో గురువారం సాయంత్రం నుంచి నిలుపుదల చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు ఆయన తెలిపారు.

అమాత్యులెవరు?

మంత్రి పదవి రేస్‌లో సీనియర్లు

గోదావరి తీరాన చంద్రబాబు కొలువులో ఎవరు మంత్రులు కాబోతున్నారు. ఏ ఏ వర్గాలకు అవకాశం ఇవ్వబోతున్నారు. సామాజిక వర్గాల వారీగా బేరీజు వేసి, సీనియార్టీని ప్రాతిపదికగా తీసుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికన ఎందరికి మంత్రి పదవులు దక్కనున్నాయి. అందరు ఊహించినట్లుగానే ట్రిపుల్ ఆర్‌కు స్పీకర్ ఇస్తారా? లేదా ? మంత్రి పదవితో సరిపెడతారా? అనే చర్చ అందరినోటా.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- తొలి వరుసలో రఘురామరాజు, పితాని, నిమ్మల
- రఘురామకు స్పీకర్ పదవి అంటూ ప్రచారం
- మిత్రపక్షాలకు ఛాన్స్ ఉండేనా ? రేపటిలోగా స్పష్టత



కె.రఘురామకృష్ణరాజు



పితాని సత్యనారాయణ



నిమ్మల రామానాయుడు




పులపర్తి అంజిబాబు



మద్దిపాటి వెంకటరాజు



కొలుసు పార్థసారథి



కామినేని శ్రీనివాస్



బొలిశెట్టి శ్రీనివాస్

చంద్రబాబు మనస్సులో ఏముంది?

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే గోదావరి ఒడ్డున ఉమ్మడి కూటమికి ఓట్లు పోటెత్తాయి. అధికార వైసీపీకి ఒక్క సీటు దక్కనివ్వకుండా మట్టి కరిపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే పట్టం కట్టారు. తిరుగులేని మెజార్టీ రికార్డులను సృష్టించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ నెల 12న ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈలోపే కొత్తగా మంత్రి వర్గంలో ఎవరెవరికి స్థానం దక్కుతుందనేదే కూటమిలో ఆతృత. సీనియర్లు తమ కార్యకర్తలను ఇప్పటికే సముదాయిస్తున్నారు. నోరుజారి కామెంట్లు చేయవద్దంటూ వారిస్తున్నారు. 2014కి ఏ మాత్రం తగ్గకుండా ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని 15 నియోజక వర్గాల్లోనూ కూటమికి సునామిలా ఫలితాలు వచ్చాయి. గెలిచిన వారిలో సీనియర్లతోపాటు తొలిసారి అసెంబ్లీకి పోటీ చేసిన వారు ఉన్నారు.

- టీడీపీ అధినేత చంద్రబాబు ఆశీస్సులు మెండుగా ఉన్న వారు లేకపోలేదు. ఇందులో ఉండి నుంచి గెలుపొందిన రఘురామకృష్ణరాజు పేరు తొలివరుసలో వినిపిస్తోంది. ఆయన పోటీకి దిగిన వెంటనే కాబోయే స్పీకర్ అంటూ ఆయన అభిమానులంతా నినాదాలు చేశారు. జగన్ ప్రభుత్వంలో అవమానాలు ఎదుర్కొన్న ఆయన తగురీతిలో బదులు తీర్చుకుంటారంటూ సెటైర్లు విసిరారు. రఘురామ ఎక్కడా నోరు జారకుండా సంయమనంతో వ్యవహరిస్తూనే అంతా చంద్రబాబు చూసుకుంటారంటూ తన భవిష్యత్‌ను చెప్పకనే చెప్పారు. రఘురామను స్పీకర్‌గా తీసుకుంటారా ? లేక ? మంత్రి పదవితో సరిపెడతారా అంటూ ఓ చర్చ సాగుతోంది. చంద్రబాబు మనస్సులో ఏముందో కాని ఒకవైపు రఘురామ అభిమానులు, టీడీపీ శ్రేణులు రఘురామకు అత్యున్నత పదవి దక్కడం ఖాయమంటూ ఇప్పటికే ధీమాగా ఉన్నారు. నరసాపురం సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయన జగన్‌రెడ్డి అకృత్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలన్నింటిని రచ్చబండ రూపంలో బహిర్గతం చేశారు. ఎవరు జగన్‌కు వ్యతిరేకంగా నోరెత్తని సమయంలోను రఘురామే ముందు వరుసలో నిలబడి కాస్కో అంటూ జగన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. ఇప్పుడు ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్నారు.
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనూ, 2014లో చంద్రబాబు హయాంలోనూ ఆయా మంత్రి వర్గాల్లో చోటు దక్కించుకున్న సీనియర్‌గా ఆచంట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ ఉన్నారు. ఆయన అనుభవం, మరోవైపు బీసీ వర్గాల ప్రతినిధిగా ఆయన కొత్త మంత్రి వర్గంలోనూ మరోసారి బంపర్ ఆఫర్ ఇచ్చి తీరతారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో గెలిచిన అభ్యర్థుల్లో ఆయనే సీనియర్ కావడం పితానికి ప్లస్ పాయింట్. వివాదరహితుడిగా వున్న ఆయనకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే కొందరు డిమాండ్ చేయడం ఆరంభించారు. పితాని సైతం చంద్రబాబు తనకు ఛాన్స్ ఇస్తారన్న ఆశాభావంతో ఉన్నారు.
- టీడీపీ రాజకీయ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడికి సైతం చోటు ఖాయమంటూ ఇప్పటికే ప్రచారం జోరందుకుంది. దీనికి తగ్గట్లుగానే పోలింగ్‌కు ముందే కాబోయే మంత్రి అంటూ నిమ్మలను ఆయన అభిమానులంతా కీర్తిస్తూ వచ్చారు. ఆయన సంయమనంతో అధిష్ఠానం నిర్ణయిస్తుందంటూ సున్నితంగా తమ వారికి చెబుతూ వస్తున్నారు. మూడోసారి వరుసగా పాలకొల్లు నుంచి హ్యాట్రిక్ సాధించారు. జగన్ ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక చర్యలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. వినూత్న నిరసనలు చేశారు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేశారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా మారారు. ఇవన్నీ నిమ్మలకు కలిసి వచ్చే అంశాలే. బలమైన సామాజికవర్గానికి చెందిన రామానాయుడు తిరుగులేని మెజార్టీతో ఈసారి పాలకొల్లు నుంచి గెలుపొందారు.
- ఎన్నికల ముందే వైసీపీని వీడి టీడీపీలో చేరి నూజివీడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందిన కొలుసు పార్థసారథి మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఆయన జగన్ ప్రభుత్వంలోను మంత్రిగా వ్యవహరించారు. తనకున్న అనుభవాన్ని బీసీ వర్గాలను దృష్టిలో పెట్టుకుని మరొక ఛాన్స్ ఇవ్వాల్సిందిగా కోరుతున్నట్లు సమాచారం. జిల్లాలో సీనియర్‌గా ఉన్న బీసీ నేత పితానికి అవకాశం ఇస్తారా? లేక? పార్థసారథికి ఇస్తారా? అనేదే పార్టీలో చర్చ సాగుతోంది.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో ప్రాంతాలతో సంబంధం లేకుండా అప్పటి ముఖ్యమంత్రి జగన్, వైసీపీ ఎమ్మెల్యేలను మంత్రులుగా తీసుకున్నారు. అంతకుముందు వరకు జిల్లాలో డెల్టా, మెట్టప్రాంతాలుగా విభజించి మంత్రులను ఎంపిక చేసేవారు. జగన్ మాత్రం దానికి స్వస్తి చెప్పి నేరుగా ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలంటే వారికే ఇచ్చేశారు. తాడేపల్లిగూడెం నుంచి కొట్టు సత్యనారాయణను ఉప ముఖ్యమంత్రిగా ఆ పొరుగునే ఉన్న తణుకు నుంచి కారుమూరి వెంకట నాగేశ్వరరావును మంత్రులుగా తీసుకున్నారు. కొవ్వూరులో ప్రాతినిధ్యం వహిస్తున్న తానేటి వనితను హోం మంత్రిగా ఎంపిక చేశారు. ఉమ్మడి పశ్చిమలో రెండో విడత ఈ ముగ్గురికి అవకాశం ఇచ్చారు. తొలి విడతలో ఈ ఏలూరు నుంచి ఆళ్ళ నానిని ఉప ముఖ్యమంత్రిగా, ఆచంట నుంచి శ్రీరంగనాథ రాజును మంత్రిగా తీసుకున్నారు. అంటే సరా సరిన 13 మంది వైసీపీ ఎమ్మెల్యేల్లో గడిచిన ఐదేళ్లలో ఐదు గురికి మంత్రి పదవులు దక్కింది. ఆ ప్రాతిపదికన చంద్రబాబు సీనియర్లకు ఈసారి అవకాశం ఇచ్చి జూనియర్లకు ఆ తదుపరి ఛాన్స్ ఇస్తారని ప్రచారం ఇప్పటికే కూటమిలో ఊపందుకుంది. ఒకవేళ సామాజిక వర్గాల వారీగా కొందరిని సంతృప్తి పరిచేందుకు విప్ లేదా చీఫ్ విప్ పదవుల్లో ఒక పదవిని ఎవరో ఒకరికి కట్టబెట్టే అవకాశం లేకపోలేదనే ప్రచారం సాగుతోంది. ఇంతకుముందు విప్‌గా టీడీపీ హయాంలో చింతమనేని ప్రభాకర్, వైసీపీ హయాంలో ముదునూరి ప్రసాదరాజు వ్యవహరించారు. ఈసారి చింతమనేనికి మంత్రి పదవి దక్కకపోతే మరోసారి విప్ పదవి ఇస్తారని భావిస్తున్నారు.

మిత్రపక్షాల సంగతేంటి..

మంత్రి మండలిలో ఎవరికి చోటు ఇస్తారనే అంశంలో ఇప్పటికే ఐదుగురి పేర్లు వినిపిస్తుండగా, ఇంకోవైపు మిత్రపక్షాల తరపున ఎవరికి ఛాన్స్ ఇవ్వబోతున్నారనేదే ఓ పెద్ద సస్పెన్స్. జనసేన పక్షాన భీమవరం నుంచి ఎన్నికైన అంజిబాబు, తాడేపల్లిగూడెం నుంచి ఎన్నికైన బొలిశెట్టి శ్రీనివాస్ పేర్లు ఇప్పటికే ప్రముఖంగానే వినిపిస్తున్నాయి. అయితే జనసేన ప్రధాన ప్రతిపక్షంగా ఉండబోతుందని ప్రచారం సాగుతున్న తరుణంలో మరోవైపు మంత్రి వర్గంలో ఎవరెవ్వరికి చోటు అనే దానిపై చర్చ సాగడం విశేషం. అయితే జనసేన అధిపతి పవన్ కల్యాణ్ నిర్ణయం మేరకే ఉభయ గోదావరి జిల్లాల్లో రెండుకు పైగా మంత్రి పదవులు దక్కడం ఖాయమని, ఇప్పటికే భారీగా ప్రచారం సాగుతోంది. నరసాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాల పరిధిలో కైకలూరు నుంచి బీజేపీ పక్షాన గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆయన ఇంతకుముందే 2014లో చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేశారు. ఈసారి కూడా కామినేని తనకు అవకాశం వస్తుందని ఆశిస్తున్నారు.

- కరోనా సమయంలో పార్టీ వ్యవహారాలను దగ్గరుంచి పర్యవేక్షించటం పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాలను క్షేత్రస్థాయిలోకి చేర్చడం, పలు అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయడం, ఆ నివేదికలను అధిష్ఠానానికి చేరవేయడం వంటి కీలక బాధ్యతలు నిర్వహించి తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి హోదాలో గోపాలపురం నియోజకవర్గంలో హోం మంత్రి తానేటి వనితపై గెలుపొందిన మద్దిపాటి వెంకటరాజు సైతం ఇప్పటికే మంత్రివర్గ రేసులో ఉన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఆది నుంచి ఆయన తెలుగుదేశం అధికారంలోకి రావడం ఎంత ఖాయమో, తాను మంత్రిని కావడం అంతే ఖాయమన్నట్లు కార్యకర్తలు వద్ద నేతలు వద్ద వ్యాఖ్యలు చేసేవారు.



టీచర్ల దొడ్డిదారి బదిలీలకు బ్రేక్

కొత్త ప్రభుత్వం సంచలన నిర్ణయం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 6 : కౌన్సెలింగ్‌కు తూట్లు పొడుస్తూ పైరవీలు, సిఫార్సులతో జగన్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేసిన ఉపాధ్యాయుల బదిలీలను తక్షణమే నిలిపివేయాలని కొత్త ప్రభుత్వం ఆదేశించడంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 30 మంది టీచర్ల బదిలీలకు బ్రేక్ పడింది. ఈ మేరకు పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్, ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ జారీచేసిన ఉత్తర్వులు గురువారం జిల్లా విద్యాశాఖకు అందాయి. ఇలా బదిలీలు నిలిచిపోయిన వారిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ఎస్జీటీలు 16 మంది, స్కూల్ అసిస్టెంట్లు 13, పరస్పర బదిలీ ఒకటి ఉన్నాయి. వాస్తవానికి టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ గతేడాది జూన్‌లో ముగియగానే బదిలీలపై నిషేధం అమల్లోకి వచ్చింది. ఆ తదుపరి అదే ఏడాది డిసెంబరులో కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా 'వాట్సాప్ బదిలీ'లుగా రాష్ట్రంలో వందల సంఖ్యలోనే దొడ్డిదారిన బదిలీలు జరిగిపోయాయి. ఇటువంటి అక్రమ బదిలీలు ఒక్కోదానికి రూ. లక్షల్లోనే చేతులు మారాయని అప్పట్లోనే ప్రచారం జరిగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 మంది గత డిసెంబరులో బదిలీలు పొందారు. పట్టణ ప్రాంతాలు, సమీప పాఠశాలల్లో క్లియర్ వెకెన్సీలున్నచోట ఈ బదిలీలు జరగ్గా, కొందరికైతే ఖాళీలు లేకపోవడంతో ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయాల్సి వచ్చింది. మళ్ళీ ఈ ఏడాది ఫిబ్రవరిలో పెద్దసంఖ్యలోనే ఉపాధ్యాయులు పైరవీలు, సిఫార్సు లేఖలతో సీఎం పేషీ, మంత్రుల పేషీల నుంచి రికమండేషన్‌లు తెచ్చుకుని జిల్లాలో నచ్చిన పాఠశాలలకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోగా ఆ మేరకు 30 మందిని బదిలీ చేస్తూ ఈ ఏడాది మార్చినెలలో సంబంధిత ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా లేఖలను విద్యాశాఖ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇలా వందల సంఖ్యలోనే బదిలీలు జరిగాయి. బదిలీ లేఖలు అందుకున్న ఉపాధ్యాయులందరినీ ఏప్రిల్ నెలాఖరున పాఠశాల విధులనుంచి రిలీవై, మే 1న బదిలీ స్థానంలో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఏప్రిల్‌లోనే ఎన్నికల నియమావళి (ఎంసీసీ) అమల్లోకి రావడంతో బదిలీ స్థానాల్లో చేరేందుకు సాంకేతికంగా అడ్డంకులు వచ్చాయి. ఈ నేపథ్యంలో గురువారంతో (ఈనెల 6) ఎంసీసీ ముగిసి, బదిలీ పొందిన ఉపాధ్యాయులు నూతన స్థానాల్లో చేరేందుకు సమాయత్తమవుతున్న వేళ తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేవరకు సంబంధిత టీచర్లనెవరినీ ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ చేయవద్దని జిల్లా విద్యాశాఖకు బుధవారం సాయంత్రం మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికనుగుణంగానే గురువారం పాఠశాల విద్య కమిషనర్, ముఖ్య కార్యదర్శుల నుంచి ఉత్తర్వులు అందాయి.

డబ్బూ పోయే..?!

ఎటువంటి ర్యాటిఫికేషన్, క్షేత్రస్థాయి నుంచి స్పష్టత లేకుండా జరిగిన ఈ బదిలీలకు కొందరు టీచర్లనుంచి లక్షలాది రూపాయల్లో వసూళ్ళు జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. అధికారాన్ని కోల్పోయిన ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ మంత్రి, ఆయన బంధువు ఈ బదిలీల్లో ఆర్థికంగా బాగా లాభపడినట్టు ఆరోపణలున్నాయి. కౌన్సెలింగ్‌తో నిమిత్తంలేకుండా పైరవీలతో జరిగిన ఈ బదిలీలు ఒకొక్క దానికి రూ.3లక్షలనుంచి రూ.5లక్షల వరకు వసూళ్ళు చేసినట్టు ఓ ప్రచారం ఉంది. ఇలా అక్రమంగా జరుగుతున్న బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు అప్పట్లోనే డిమాండ్ చేశాయి. నచ్చిన పాఠశాలకు బదిలీ కోసం రూ.లక్షల్లోనే సమర్పించుకున్న కొందరు ఉపాధ్యాయులు ఇప్పుడు నూతన స్థానాల్లో చేరేందుకు సమాయత్తమవుతుండగా అకస్మాత్తుగా కొత్త ప్రభుత్వం నిలిపివేయడంతో వారి పరిస్థితి డోలాయమానంలో పడింది. కారణాలు ఏవైనా బదిలీ లను నిలిపివేసిన నేపథ్యంలో డబ్బులు చెల్లించిన ఉపాధ్యా యులు ఇప్పుడు వాపస్ కోరదామను కుంటే ఎన్నికల్లో ఘోర పరాజయం పొంది, అధికారాన్ని కోల్పోవడంతో కనీసం ఒత్తిడి చేయడానికి కూడా ఎవరూ లేక, ఎవరికీ చెప్పుకోలేక లోలోన మదనపడుతూ రెండింటా నష్టపోయినట్టయింది. మరోవైపు కౌన్సెలింగ్‌పై నిషేధం వున్న సమయంలో ఎన్నిలకు ముందు జరిగిన ఈ బదిలీలు వివాదాస్పదం కావడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరనుండటంతో ఏదైనా విచారణ పేరుతో ఇరకాటంలో పడతామేమోనన్న భయాందోళనలు ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఆరు రోజులు గడిచినా..

అందని జీతాలు, పెన్షన్లు


ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 6 : ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంకావడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు మే నెల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు గురువారం నాటికి కూడా పూర్తిస్థాయిలో అందలేదు. ఇప్పటికే నెలలో ఆరురోజులు పూర్తికాగా, మరో నాలుగైదు రోజుల వరకు జిల్లాలో జీతాలు అందరికీ అందే అవకాశాలు లేవని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో జీతభత్యాలపై ఆధారపడిన ఉద్యోగ కుటుంబాలు, పెన్షనర్లు వివిధ అవసరాల కోసం ఆర్థిక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. మొత్తం 60 ప్రభుత్వ శాఖల నుంచి ఏలూరు జిల్లాలో రెగ్యులర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సుమారు 25 వేల మంది పని చేస్తున్నారు. వీరితో పాటు పెన్షన్ తీసుకునే రిటైర్డ్ ఉద్యోగులు 15 వేల మంది వరకు ఉన్నారు. వీరందరికీ జీతభత్యాలు, పెన్షన్ల చెల్లింపు నిమిత్తం నెలకు రూ.200 కోట్ల వరకు అవసరమవుతాయి. ఇక కాంట్రాక్టు ఉద్యోగులు 1500 మంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 4వేల మంది జిల్లాలో పనిచేస్తున్నారు. ఇంతవరకు రెగ్యులర్ ఉద్యోగులకే పూర్తిస్థాయిలో జీతాలు అంద లేదంటే, ఇక కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎప్ప టికి వేతనాలు అందుతాయో చెప్పలేని దుస్థితి నెలకొంది. కొన్ని శాఖల్లో గత నాలుగునెలలుగా వేతనాలు అందుకోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఉన్నారని తెలిసింది. ఈ నెల ఒకటో తేదీన కేవలం ఒకట్రెండు శాఖల ఉద్యోగు లకు మాత్రమే జీతాలు బ్యాంకు ఖాతాలకు జమ అయ్యా యని, రాష్ట్ర ప్రభుత్వం వద్ద తగినన్ని నిధుల లభ్యత లేకపోవడం వల్లే నెలనెలా సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యం లోనే రిజర్వ్ బ్యాంకు నుంచి అప్పుగా ప్రభుత్వం తెచ్చు కున్న రూ.4వేల కోట్లు జమ కావడంతో బుధ, గురు వారాల్లో కొన్ని శాఖల ఉద్యోగులకు చెల్లింపులు జరిగాయని అధికార వర్గాలు వివరించాయి. ఈ నిధులను జీతాలు, పెన్షన్ల నిమిత్తం ఖర్చుచేసినా, ఇంకా ఉపాధ్యాయులకు గురువారం నాటికి కూడా జమ కాలేదని తెలిసింది. దీనిపై ఖజానా శాఖ వర్గాలు వివరణ ఇస్తూ 'జిల్లాలో కనీసం 30 నుంచి 40 శాతం మంది ఉద్యోగులకు, అంతకంటే ఎక్కువ శాతం మంది రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు అందాల్సి ఉంది. ఈ నెల పదో తేదీ నాటికి నిధుల లభ్యతను బట్టి అందరికీ జీతాలు, పెన్షన్లు జమఅయ్యే అవకాశం ఉంది.' అని వివరించాయి.

నిధులు ఫుల్.. జీతాలు నిల్

- నాలుగు నెలల నుంచి జీతాలు లేని ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆరోగ్య శ్రీ ఉద్యోగులు

ఏలూరు క్రైం, జూన్ 6 : నిధులు నిండుగా ఉన్నా జీతాలు ఇవ్వడానికి మాత్రం అధికారులు సవలక్షా సాకులు చెబుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య శ్రీ విభాగంలో 21 మంది ఔట్‌సోర్సింగ్ విభాగంలో వివిధ రకాల ఉద్యోగులు పని చేస్తున్నారు. ఆస్పత్రిలో చేరే ప్రతి రోగికి అవసరమైన ఆపరేషన్లకు ఆరోగ్యశ్రీ సిబ్బంది వారికే షీట్లను, ఎక్సరేలు, ఇతర ల్యాబ్ రిపోర్టులు, స్కాన్ రిపోర్టులను ఆరోగ్యశ్రీ సెంటర్‌కు అప్‌లోడ్ చేస్తూ ఉంటారు. అక్కడ నుంచి అనుమతులు పొందుతూ ఉంటారు. ఆ తర్వాత ఆరోగ్య శ్రీ ఆపరేషన్లు నిర్వహిస్తారు. ఆరోగ్య శ్రీ ట్రస్టు నుంచి నిధులు జమ అవుతూ ఉంటాయి. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో కోట్లాది రూపాయలు ఆరోగ్య శ్రీ నిధులు ఉన్నాయి. ఉద్యోగులకు మాత్రం ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకూ జీతాలు ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేశారు. అయితే ఆరోగ్య శ్రీ ఉద్యోగులు మాత్రం థర్డ్‌పార్టీ కాంట్రాక్టులో స్కాట్‌ల్యాండ్ అనే సంస్థ ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో 21 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఆస్పత్రి ఆరోగ్యశ్రీ నిధుల నుంచి ఆ సంస్థకు ఉద్యోగుల జీతాలను మెడికల్ సూపరింటెండెంట్ ప్రతి నెలా ఇచ్చేవారు.

ప్రస్తుతం డీఎంఈ పరిధిలోకి వచ్చాక జీతాలను నిలుపుదల చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిని కూడా మెడికల్ కాలేజీగానే తీర్చిదిద్దారు. అక్కడ మెడికల్ సూపరింటెండెంట్ యథావిధిగానే ఆరోగ్య శ్రీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలను చెల్లిస్తున్నారు. ఇక్కడ మాత్రం సిబ్బందికి జీతాలు ఇవ్వడంలో అనేక సాకులు చెబుతున్నారని విమర్శలు వస్తున్నాయి. చివరకు ఉద్యోగులు డీఎంఈ అధికారుల వద్దకు వెళ్ళితే తమ పరిధిలో లేదని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంటే ఆ నిధుల నుంచి చెల్లించే అధికారం ఉందంటూ అక్కడ చేతులు ఎత్తేశారు. జీతాలు చెల్లించకుండా ఆ నిధులను వివిధ పనులకు అనుమతులు లేకుండా ఖర్చు పెట్టేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా తక్షణం ఉన్నతాధికారులు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల వేతనాలపై పరిశీలన చేసి చెల్లించాల్సిన అవసరం ఉంది.



విధులను నిర్వర్తిస్తున్న ఆరోగ్య శ్రీ సిబ్బంది



ఘర్షణ పడుతున్న వారిని అడ్డుకుంటున్న స్థానికులు

భగ్గుమన్న పాత కక్షలు

- ఇరువర్గాల మధ్య కత్తిపోట్లు
- ఇద్దరికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- మెయిన్‌లో..



ఎగువ కాఫర్ డ్యాం పరిశీలిస్తున్న పీపీఏ డైరెక్టర్, ప్రాజెక్టు అధికారులు

పోలవరం పరిశీలించిన ప్రాజెక్టు అథారిటీ డైరెక్టర్

పోలవరం, జూన్ 6: పోలవరం ప్రాజెక్టు అథారిటీ డైరెక్టర్ మన్నూజి ఉపాధ్యాయ, ఇంజనీరింగ్ అధికారులు గురువారం ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్‌కు ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత వివరాలు తెలిపారు. తొలుత పోలవరం ప్రాజెక్టు హిల్‌వ్యూ నుంచి ప్రాజెక్టు పరిశీలించిన అధికారులు అనంతరం స్పిల్‌వే, స్పిల్ ఛానల్, గ్యాలరీ, ఆప్రోచ్ ఛానల్, ఎగువ దిగువ కాఫర్ డ్యాంలు, డయాఫ్రం వాల్, ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాం ప్రాంతం, కుడి ఎడమ కాలువల కనెక్టివిటీ పనులు, పవర్ హౌస్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రాజెక్టు ఇంజనీర్లు మల్లికార్జున రావు, ప్రేమ్ చంద్, పి.వెంకటరమణ, కె.బాలకృష్ణ, పాండు రంగయ్య, కనకేష్ తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వర స్వామి



నీటి మునిగిన స్వామి

నత్తారామేశ్వరం రామలింగేశ్వరస్వామి

దర్శనం నిలుపుదల

▸ నీటితో నింపిన ఆలయం ▸ కిటకిటలాడిన భక్తులు

పెనుమంట్ర, జూన్ 6 : మండలంలోని నత్తా రామేశ్వరంలోని పరశురాముడు ప్రతిష్ఠించిన శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారిని దర్శించుకునేందుకు బార్లు తీరారు శివాలయం ప్రాంగణమంతా శివనామ స్మరణతో మార్మోగింది. శ్రీరామలింగేశ్వర స్వామికి ఏకాదశి రుద్రాభిషేకం మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు పంచామృతాలతో అభిషేకాలు చేశారు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించారు మహా నివేదన అనంతరం స్వామి వారిని నీటితో నింపారు. ఏడాదిలో 11 నెలలు నీటిలో ఉండి వైశాఖ మాసంలో దర్శనం ఇచ్చే శ్రీరామలింగేశ్వర స్వామి దర్శనం పొందాలంటే ఏడాది ఎదురు చూడాల్సిందే. స్వామివారిని నరసాపురం పార్లమెంట్ సభ్యుడు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ సతీమణి వెంకటేశ్వరి కుటుంబ సభ్యులు దర్శించుకుని అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆచంట నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కేహెచ్ వి.ప్రసాద్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు తమనంపూ డి.శ్రీరామ దుర్గారెడ్డి రవి, తుపాకుల గోవింద్, పృధ్విరాజ్, పుల్లాజి అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ, అభిషేక పురోహితులు కాశీభట్ల సూర్యనారాయణ మూర్తి భాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 30 వరకు 'ఇగ్నో' ప్రవేశాలకు గడువు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 6 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) దూరవిద్య కోర్సులు, ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయిందని సీఆర్ఆర్ కళాశాల 'ఇగ్నో' స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ కోర్సులు, యూజీ, పీజీ, డిప్లమో కోర్సులకు యూనివర్శిటీ వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలు పొందేందుకు జూన్ 30వ తేదీ వరకు గడువు ఉందన్నారు. వివరాలకు 94903 50469లో సంప్రదించాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 6 : ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ(డీఎల్‌టీసీ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాశ్ యోజన పథకం కింద ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండీషనర్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి, ఆ పైన విద్యార్హతలు కలిగి 35 ఏళ్లలోపు వయస్సున్న అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 83328 36944, 94934 82414లలో సంప్రదించాలన్నారు.

20న ఆక్వారంగ సమస్యలపై సమావేశం



విలేకర్లతో మాట్లాడుతున్న భగవాన్‌రాజు

పాలకొల్లు అర్బన్, జూన్ 2 : ఆక్వారంగ సమస్యలపై ఈ నెల 20వ తేదీన పాలకొల్లు శివా రు చందపర్రు రోడ్డులో ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని జైభారత్ క్షీరా రామా ఆక్వా రైతు సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచరీస్‌లో, ఫీడ్ ధరలు, విద్యుత్ సమస్యలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. నూతన ప్రభుత్వంలో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశశారు. ఈ సమావేశానికి భారీ మెజారిటీలతో విజయం సాధించిన ఎంపీ, ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తామన్నారు. సంఘ కార్యదర్శి బోణం చినబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కోడి విజయభాస్కర్, రుద్రరాజు సత్యనారాయణ రాజు, కోశాధికారి దాట్ల సోమేశ్వర రాజు, సభ్యులు అంగర వర ప్రసాద్, బోణం రంగయ్య నాయుడు, జి.ఈశ్వరరాజు, జి.శ్రీను రాజు, జి.మనోహర వర్మ పాల్గొన్నారు.

ఓపెన్ దూరవిద్య పరీక్షకు 152 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 6 : ఓపెన్ స్కూల్స్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు జిల్లాలో 436 మంది, ఇంటర్మీడియట్ గణితం పరీక్షకు 271 మంది, చరిత్ర పరీక్షకు 144 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ రాజీనామా



రాఘవరెడ్డి

చాట్రాయి, జూన్ 6: ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందటంతో నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గురువారం తన రాజీనామాను కమిషనర్ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్‌కి పంపారు. ఏడాదిన్నర పాటు ఆయన ఈ పదవిలో కొనసాగారు. 50 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్న దేశిరెడ్డి సర్పంచ్, పీఏసీఎస్ అధ్యక్షుడిగా, జడ్పీటీసీ, ఏఎంసీ చైర్మన్ తదితర పదవులు నిర్వహించారు.

అడ్మిషన్ కౌంటర్‌లో కానరాని సిబ్బంది



ఏలూరు క్రైం, జూన్ 6 : స్థానిక ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగం ఎంతో ముఖ్యమైనది. ఎన్నో ప్రమాదకరమైన కేసులు వస్తూ ఉంటాయి వారికి ఓపీ టిక్కెట్‌ను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి ఇవ్వాల్సి ఉంది. ఆసుపత్రిలో చేరితే ఆన్‌లైన్‌లో వారి వివరాలు అన్నీ నమోదు చేయాల్సి ఉంది. ఒక వేళ రిఫరల్ అయితే వెంటనే ఓపీ టిక్కెట్‌తో పాటు రిఫరల్ కార్డు రాసి పంపించాల్సి ఉంది. ఇవన్నీ కూడా అత్యవసర విభాగంలో ఎంతో కీలకమైన విధులు. ఇక్కడ మూడు షిఫ్టులుగా ఎంఎన్‌వోలు అడ్మిషన్ కౌంటర్‌లో పనిచేస్తూ ఉంటారు. గురువారం రాత్రి 8 గంటల నుంచి అక్కడ ఎవ్వరు విధులలో లేకపోవ డంతో ఎంతో మంది ఆసుపత్రి కి వచ్చిన వారు అడ్మిషన్లు లేక, ఓపీ టిక్కెట్ లేక అత్యవసర విభాగంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. తల్లిబిడ్డల విభాగంలో చేరే గర్భిణులు, ఇతర వైద్యం కోసం వచ్చే మహిళలు, చిన్న పిల్లలు కూడా ఇక్కడే అడ్మిషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అనేకసార్లు ఇలా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇక అర్ధరాత్రి 12 దాటిందంటే సిబ్బందిలో కొంత మంది ఇళ్లకు వెళ్లిపోతారని చెప్పుకుంటున్నారు. గతంలో పని చేసిన అధికారులు అర్ధరాత్రి వేళ, తెల్లవారు జామున ఆకస్మికంగా ఆసుపత్రిని తని ఖీ చేసేవారు. మెడికల్ కాలేజీగా అవతారం ఎత్తిన తరువాత తనిఖీలు చేయ డం లేదనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు తక్షణం అత్యవసర విభాగంపై దృష్టి పెట్టి ఆసుపత్రికి వచ్చే రోగులకు సత్వర సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన ఏడుకొండలు

ఏలూరు క్రైం, జూన్ 6 : హోం గార్డు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మరో మోటారు సైకిల్ వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో హోంగార్డుతో పాటు ఢీ కొన్న మోటారు సైకిలిస్టు కూడా తీవ్ర గాయాలపాల య్యాడు ఏలూరు చొదిమెళ్లకు చెందిన యడ్ల ఏడుకొండలు (హెచ్‌జి 906) 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న మూడో నెంబర్ సేఫ్టీ పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి కడుపునొప్పిగా ఉండడంతో టాబ్లెట్స్ తెచ్చుకోవడానికి కొవ్వలి వంతెన వద్ద నుంచి ఊరిలోకి వెళ్లే నిమిత్తం రాత్రి 9 గంటలకు మోటారు సైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి మరో మోటారు సైకిలిస్టు ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఢీకొన్న మోటారు సైకిలిస్టు గుండుగొలను లోని సెల్ షాపు నిర్వహిస్తున్న తేరక ఈశ్వరరావుగా గుర్తించారు. వీరిద్దరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి హైవే రోడ్డు సేఫ్టీ వాహనంపై తరలించారు. హోం గార్డు ఏడు కొండల పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో రాత్రి 10 గంటలకు ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టుకు సమాచారం ఇచ్చారు.

ఆ 2 కిలోమీటర్లు తప్ప

కొనసాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కలిసే గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రహదారి ప్రారంభ దశలో కొన్ని ఆటంకాలు వచ్చినప్పటికి తర్వాత పనుల్లో వేగం పెరిగింది. రైతులు తమకు నష్టపరిహారం సరిపోవడం లేదంటూ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలంటూ చింతలపూడి, కొయ్యలగూడెం మండలాల్లో అనేక ఉద్యమాలు చేపట్టారు. పనులను అడ్డుకున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే నష్టపరిహారం ఇచ్చి పనులు మొదలు పెట్టేసింది. కొంత మంది తమ పొలాలను కన్వర్షన్ చేయించామని దానికి అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలంటూ హై కోర్టుకు వెళ్లారు. ఆ భూముల్లో తప్ప మిగిలిన అన్ని చోట్ల పనులు శర వేగంగానే సాగుతున్నాయి. ఈ రహదారి వల్ల విశాఖపట్నం-హైదరాబాద్‌కు సుమారు 60 కిలోమీటర్ల దూరం తగ్గనుంది.



గణిజర్ల వద్ద తారు రోడ్డు నిర్మాణం

కొయ్యలగూడెం/చింతలపూడి జూన్ 1: గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణ శాఖ ద్వారా రూ.4,609 కోట్లతో అంచనాలు రూపొందించగా, ఐదు ప్యాకేజీలుగా విభజించి మూడు కంపెనీలు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం కోసం 1,411 ఎకరాల భూమి అవసరం కాగా ప్రభుత్వ భూమి 114 ఎకరాలు, రైతుల నుంచి 1,297 ఎకరాలు సేకరించారు. 2024 చివరి నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గురుపట్లగూడెం నుంచి ఏలూరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది. తెలంగాణ రాష్ట్రం చిత్తగూడెం నుంచి ఏలూరు జిల్లాలోని చింతలపూడి మండలం రేచర్ల వరకు కేఎంయూ కంపెనీ 44 కిలోమీటర్ల పనులను చేపట్టగా, రేచర్ల నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని దేవరపల్లి వరకు 56.89 కిలోమీటర్ల పనులను బెక్కం కంపెనీ దక్కించుకుంది. రూ.1,555 కోట్లతో ప్రారంభించిన ఈ పనులు ఇప్పటి వరకు 60 శాతం పూర్తయినట్టు అధికారులు, కాంట్రాక్ట్ కంపెనీ చెబుతోంది. రేచర్ల, దేవరపల్లి మధ్య రేచర్ల, గుర్వాయిగూడెం, పొంగుటూరు, దేవరపల్లిలో జంక్షన్లు ఉన్నాయి.



ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై కార్లు గంటకు 120 మీటర్లు, భారీ వాహనాలు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేందుకు వీలుగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

పరిహారం తక్కువ ఇచ్చారని రైతుల ఆందోళనలు

రోడ్డు నిర్మాణం కోసం జరిగిన భూసేకరణలో చింతల పూడి మండలంలోని రైతులు పలుమార్లు తమ విలువైన భూములు ఇచ్చినప్పటికీ పరిహారం తక్కువ ఇచ్చారని, తెలంగాణ ప్రాంతానికి ఎక్కువ ఇచ్చారని తమకు న్యాయం చేయాలంటూ నిరసనలు, పనులు అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి. ఈ మేరకు రోడ్డు పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఎట్టకేలకు కలెక్టర్ చొరవతో పరిహారం పెంచి ఇవ్వడంతో చాలావరకు రైతుల శాంతించారు. పొలాలకు వెళ్లేందుకు సర్వీస్ రోడ్లు వేయాలని, నిర్మాణం కోసం తిరుగుతున్న భారీ వాహనాల వల్ల ప్రస్తుతం ఉన్న రోడ్లు పాడై అధ్వానంగా మారుతున్నాయంటూ ప్రజల్లో ఆందోళన ఉంది. ఎండపల్లి వద్ద చెరువులో తీసిన గోతులు ఇంకా పూడ్చలేదని, గ్రామానికి చెందిన రైతు మోరంపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ చెరువులో సింగిల్ కానా వంతెన నిర్మాణం వల్ల వరద నీరు పోటెత్తుతుందని ఆందోళన చేయడంతో రెండు కానాల వంతెన నిర్మాణం చేపట్టారు.

కోర్టు పెండింగ్‌లో ..

ఈ రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నప్పటికీ రెండు కిలోమీటర్ల మేర కోర్టు పెండింగ్‌లో ఉండడంతో ఆ ప్రాంతంలో పనులు జరగడం లేదు. కొయ్యలగూడెం మండలం యర్రంపేట, రాజవరం, కన్నాయిగూడెం గ్రామాల్లోని రైతులు తమ పొలాలకు కన్వర్షన్ చేయించామని, ఎకరాకు రూ.30 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని హైకోర్టుకు వెళ్లారు. ఈ మేరకు ఆ రెండు కిలోమీటర్లు మినహా మిగిలిన మొత్తం పనులు జరుగుతున్నాయి. దీని వలన 2024 సెప్టెంబరు నాటికి పూర్తికావాల్సిన పనులు ఇంకా కొన్ని నెలలు సమయం పట్టే అవకాశం ఉంది.

చింతలపూడిలో భూసేకరణ

గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం కోసం చింతలపూడి మండలంలో అనేక గ్రామాల్లో భూసేకరణ జరిగింది. గురుపట్లగూడెం, లింగగూడెం, యండపల్లి, రాఘవాపురం, చింతకాయల కొత్తగూడెం, గణిజర్ల, వెంకటాద్రిగూడెం, వెంకటాపురం, నామవరం నుంచి శెట్టివారిగూడెం, రేచర్ల వరకు రోడ్డు నిర్మాణాలు పనులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో పలు కల్వర్టులు, వంతెనలు, అండర్ పాస్ రోడ్లు 49 వరకు ఉన్నాయి. దీనిలో బాక్స్ కల్వర్టులు 29, చిన్నవాహనాలు అండర్ పాస్‌లు ఆరు, పెద్ద వాహనాల అండర్‌పాస్‌లు రెండు, ప్రజా రహదారులు ఐదు, మేజర్ బ్రిడ్జిలు నాలుగు, లైట్‌వెయిట్ అండర్ పాస్‌లు రెండు ఉన్నాయి. చింతకాయల కొత్తగూడెం వద్ద వాహనాల రెస్ట్ ప్లేస్ నిర్మాణం జరగాల్సి ఉంది. రేచర్ల వద్ద ఎంటర్ ఛేంజ్‌పాయింట్ ఏర్పాటు చేస్తారు. దీంతో ఏలూరు -హైదరాబాద్‌కి కూడా దూరం తగ్గుతుంది.

కూటమి రాకతో రియల్ జోష్

▸ ఊపందుకున్న ప్లాట్ల అమ్మకాలు ▸ ఊపిరిపీల్చుకుంటున్న రియల్టర్లు ▸ నిర్మాణరంగానికి ఊపు

▸ నూతన ఇసుక పాలసీకై ఎదురుచూపులు



పాలకొల్లు, జూన్ 6 : అనూహ్య రీతిలో కూటమి విజయ బావుటా ఎగురవేయడంతో నవ్యాంధ్రలో రియల్ జోష్ మొదలైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పదుల సంఖ్యలో మదుపు దారులు అమరావతి ప్రాంతంలో పెద్ద మొత్తాలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేశారు. అయితే ఐదేళ్ల సైకో పాలనలో రాజధాని స్థిరత్వం లేకుండా చేయడంతో అమరావతి ప్రాంతంతో పాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోనూ రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అయ్యింది. పెట్టుబడి పెట్టిన రియల్టేర్‌లతో పాటు రియల్ ఎస్టేట్ డీలర్లు, అమ్ముకునే ఏజెంట్లు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారితేనే రియల్ ఎస్టేట్ రంగానికి పూర్వ వైభవం వస్తుందని ఆ రంగంలో ఉన్నవ్యాపారులు బహిరంగంగానే చెప్పుకొచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గడిచిన ఐదేళ్లలో రియల్ ఎస్టేట్ రంగానికి ఐదు వేల కోట్లు నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. ఏటా సుమారు వెయ్యి ఎకరాలో ఉమ్మడి జిల్లాల్లో లే అవుట్‌లు విస్తరించేవి. అయితే గడిచిన ఐదేళ్లల్లోనూ నూతనంగా వేసిన లేఅవుట్లె వెయ్యి ఎకరాలు మించదని ఆ రంగంలో ఉన్న నిపుణులు చెబుతున్నారు. అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఐదింట ఒకింతుకు పడింది. మరో వైపు ఇసుక కాష్టాలతో భవన నిర్మాణ రంగం కుదేలు అయ్యింది.

వాస్తవంగా పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ముందంజలో ఉండేది. జగన్ రెడ్డి పాలన మొదలైన ఏడాదికే తిరోగమనం పట్టడంతో అధిక శాతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్‌లు హైదరాబాద్ వంటి నగరాలకు తరలి పోయారు. ఇపుడు నూతన ప్రభుత్వం ఏర్పడునుండడంతో మరలా ఇటు వైపు రియల్టర్లు దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే విశాఖపట్టణం, పరిసర ప్రాంతాల్లో 30 శాతం మేరకు ధరలు పడిపోయాయి. అమరావతి ప్రాంతంలో రెండు రోజుల వ్యవధిలోనే పది నుంచి 20 శాతం ధరలు పెరిగాయి. ఉమ్మడి జిల్లాల్లోని ఏలూరు కార్పొరేషన్‌తో సహా అన్ని పట్టణాల్లోనూ వందల సంఖ్యలో లే అవుట్లలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. నాలుగేళ్లుగా స్థలాల్లో భవనాలు నిర్మించుకునే వ్యక్తులు మినహా వ్యాపార పరంగా అమ్మకాలు జరగలేదు. ఇపుడు ఎన్నికల ముగియడం, మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున నగదు రావడంతో పెట్టుబడి దారులు స్థలాలు వైపు దృష్టి సారిస్తున్నారు. మొన్నటి వరకు ఉన్న ధరలకు మించి కేవలం రెండు రోజులు వ్యవధిలో పది శాతం మేరకు ధరలు పెరిగాయి. స్థలాలు వ్యక్తి గత భవనాలు అమ్మకాలు అగ్రిమెంట్‌లు వేగంగా జరుగుతున్నాయి.

కూటమి తరుపున చంద్రబాబు ఎన్నికలకు ముందు మరలా ఉచిత ఇసుక పాలసీ అమలులోకి తెస్తామని వాగ్దానాలు చేశారు. అదే జరిగితే భవన నిర్మాణ రంగానికి పూర్వ వైభవం వస్తుంది. ఐదేళ్లుగా అమ్మకాలు లేక బిల్డర్‌లు నూతనంగా అపార్టుమెంట్‌లు వ్యక్తిగత భవన నిర్మాణాలు చేపట్టలేదు. ఇపుడు మరో రెండు నెలలు మూఢం ఉన్నప్పటికీ నిర్మాణ రంగం ఈ ఆర్థిక సంవత్సరంలో ఊపందుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మూడవ త్రైమాసికంలో ధరలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. సెప్టెంబరు, అక్టోబరు నుంచి ముహూర్తాలు ఉండటం, అప్పటికి రాష్ట్రంలో పూర్తి స్థాయిలో పారదర్శకమైన పాలనతో ఇసుక, భవన నిర్మాణాలకు మరింత ఊతమి వచ్చే అవకాశం కనిపిస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే సుమారు మూడు వేల ఎకరాల్లో ఇండ్ల స్థలాలు నిరర్థకంగా ఉన్నాయి. సుమారు ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లాల్లో 2,3 బెడ్‌రూమ్‌ల ప్లాట్‌లు 2,500 పై బడి ఉన్నాయి. ఇవన్ని అమ్మకాలు జరిగితే బిల్డర్లు మరింత ఉత్సాహంగా నిర్మాణాలు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే భవన నిర్మాణాలతో ముడిపడి ఉన్న సుమారు 30 రకాల అనుబంధ వ్యాపారాలు తగినంతగా లేక నీరశించిపోయాయి. ఉచిత ఇసుక పాలసి అమలులోకి వచ్చి బిల్డర్లు నిర్మాణాలు చేపట్టడం ప్రభుత్వ పరంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడితే జిల్లాలో ఏడాది తిరగకుండా రియల్ ఎస్టేట్ రంగానికి పూర్వ వైభవం వస్తుందని అంచనా వేస్తున్నారు.

చార్లెస్‌నగర్‌లో చిరుత అడుగుజాడలు



చింతలపూడి, జూన్ 6: స్థానిక చార్లెస్ నగర్‌లో చిరుతపులి అడుగు జాడలు కనిపించడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. కంచెనగూడెం ఫారెస్ట్ సీసీ కెమెరాలో వర్షం పడటం వల్ల కాలి ముద్రలు స్పష్టంగా కనిపించాయని చార్లెస్ నగరవాసులు చెబుతున్నారు.

పీఎం అవార్డుల ఎంపికకు కేంద్ర బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, జూన్ 6: ప్రైమ్ మినిస్టర్ అవార్డు ఫర్ ఎక్స్‌లెన్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2023 అవార్డుల ఎంపిక ప్రక్రియలో భాగంగా జిల్లాలో క్షేత్రస్థాయిలో ఈ నెలలో పర్యటించనున్న కేంద్ర బృందానికి సమగ్ర సమాచారాన్ని అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్షించారు. ఈ బృందం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులు, లబ్ధిదారుల ద్వారా సమాచారం సేకరిస్తుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు కలిగిన ప్రయోజనాలను ఉత్తమ అభ్యాసాలను బృందం పరిశీలిస్తుందన్నారు. సంబంధిత పథకాలు, సమగ్ర వివరాలు, విజయగాథలను, ఫొటోలను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్‌ఈ ఎన్‌వీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పురుగు మందు కలిసిన నీరు తాగి సైనికుడి మృతి



ఈతకోట హేమంత్‌కుమార్

పెదవేగి, జూన్ 6 : పురుగుమందు కలిసిన నీరు తాగి ఓ సైనికుడు మృతి చెందాడు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన ఈతకోట హేమంత్ కుమార్ ఢిల్లీలో సైన్యంలో నాయక్‌గా పని చేస్తున్నాడు. అతను గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు ఢిల్లీ నుంచి స్వగ్రామం కూచింపూడి వచ్చారు. బుధవారం పొలానికి పురుగు మందు పిచికారీ చేయించారు. ఆ సమయంలో దాహం కావడంతో సీసాలో నీరు తాగాడు. అయితే పెద్ద డబ్బాలో ఉన్న పురుగు మందును సీసాలో వేసి పొలంలో పిచికారీ చేశారు. ఆ తరువాత సీసాలో మోటారు నీరు పట్టి ఉంచారు. ఈ విషయం తెలియని హేమంత్ కుమార్ సీసాలో ఉన్న నీటిని తాగేశాడు. కొద్దిసేపటికి అస్వస్థతకు గురికావడం, ఆపై అపస్మారక స్థితికి చేరుకోవడంతో బుధవారం సాయంత్రం అతనిని ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న హేమంత్ కుమార్(35) గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీనిపై మృతుని తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మృతుడు హేమంత్‌కుమార్‌కు భార్య వాణి, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.

పిడుగుపాటుకు మంటలు



దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

మొగల్తూరు, జూన్ 6: శివాలయం సమీపంలో ఒక కొబ్బరి చెట్టుపై బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో పిడుగు పడటంతో ఆ చెట్టు నుంచి భారీ మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు తీవ్ర భయందోళన చెందారు. నివాసాల్లోని ఫ్యాన్లు, లైట్లు, ఏసీలు, టీవీలు, ఇన్వెర్టలు కాలిపోయాయి. మొగల్తూరు జాతీయ రహదారి వెంబడి గల పలు దుకాణాల్లోనూ విద్యుత్ సామగ్రి కాలి పోయిందని వ్యాపారులు తెలిపారు. ఒక్కసారిగా ఇంత స్థాయిలో వర్షం కురవగా మొగల్తూరులో 63.2 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. చలిగాలులతో చేప, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ లోపంతో మత్స్య సంపద వడ్డుకు రావడం, చేతికి అందిన మామిడి ఫలసాయం నేల రాలింది. ఆరు తడి సాగు చేసిన మినుము, పెసలు చేలు వాలిపోయాయి.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య



మృతుడు ఆశీర్వాదం (ఫైల్)

లింగపాలెం, జూన్ 6: ప్రియుడితో కలిసి తన భర్తను హత్య చేసిన భార్య ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన సుమలత అనే మహిళ తన భర్తను ప్రియుడితో కలిసి ఉరివేసి చంపినట్లు తెలిపారు. చిట్టిమాల ఆశీర్వాదం (28) జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన భార్య సుమలత ఏలూరు శివారు కొప్పాక గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో పరిచయం ఏర్పడి, అతనితో అక్రమ సంబంధం కొనసాగిస్తుందని తెలిపారు. వీరిద్దరు కలిసి మూడు రోజుల క్రితం ఆశీర్వాదానికి నిద్ర మాత్రలు వేసి అతను నిద్రపోయిన అనంతరం వైరుతో మెడ బిగించి హత్య చేశారన్నారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులను, గ్రామస్తులను నమ్మించారని తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు. అనంతరం ఆమె ప్రవర్తనపై అనుమానం రావడంతో ఆమె ఫోన్‌ను పరిశీలించగా ఫోన్‌లో ఆమె ప్రియుడు నాగరాజుతో కలిసి దిగిన ఫొటోలను చూసి ఆమెను గట్టిగా నిలదీయడంతో తానే చంపినట్లు ఒపుకుందన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు కేసున మోదు చేసి మృతదేహాన్ని బయటకు తీసి తహసీల్దార్, సీఐ సుధాకర్, ఎస్ఐ చెన్నారావు ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



మృతి చెందిన ఉపాధి కూలీ శివశంకరమూర్తి

అత్తిలి, జూన్ 6 : ఉనికిలి గ్రామంలో పంట కాలువ పూడికతీత పనుల్లో పాల్గొన్న ఉపాధి హామీ కూలీ వీరవల్లి శివశంకరమూర్తి పని ప్రదేశంలో గుండె పోటుతో గురువారం మృతి చెందాడు. పని ప్రదేశాన్ని అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఫణి రాజు, టెక్నికల్ అసిస్టెంట్ నవ్యలత, స్వరూప్ సందర్శించారు. మృతుని కుటుంబానికి ఉపాధి హామీ పథకం చట్ట ప్రకారం రావాల్సిన సహాయం అందించేలా జిల్లా అధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

ఏలూరు క్రైం, జూన్ 6 : జాతీయ రహదారిపై మూర్ఛవ్యాధి వచ్చి అకస్మాత్తుగా పడిపోయిన వృద్ధుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారం రోజుల క్రితం హనుమాన్ జంక్షన్‌లోని విజయవాడ రోడ్డులో మాసిన జుత్తు, చిరిగిన దుస్తులతో, రోడ్డుపై తిరుగుతూ ఉండగా అక్కడి వారు స్నానం చేయించి అతనికి క్రాఫ్ చేయి ంచి దుస్తులను వేశారు. ఆ తరువాత ఆ ప్రాంతంలో తిరుగుతూ ఫిట్స్ వచ్చి పడిపోయాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా గురువారం ఉదయం మృతి చెందాడు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీ లో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు, ఆసుపత్రి సిబ్బందికి గాని తెలియజేయాల్సి ఉంది.

టీడీపీకి మద్దతిచ్చావంటూ మహిళపై దాడి

ముసునూరు, జూన్ 6: తెలుగుదేశం పార్టీకి మద్దతిస్తారా? మేమంటే భయం లేదా? అంటూ సర్పంచ్ భర్త, ఎంపీటీసీ కలసి తమ ఇంటిపై దాడికి దిగారంటూ ముసునూరు మండలం బలివేకు చెందిన మహిళ ముసునూరు పోలీసులను గురువారం ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలివేకు చెందిన తోట ఆంజనేయులు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఇతని భార్య వెంకట లక్ష్మి. తాము టీడీపీ పక్షాన ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, టీడీపీ గెలుపొందడాన్ని జీర్ణించుకోలేక సర్పంచ్ భర్త రావు సుధాకర్, ఎంపీటీసీ దాసరి సుమన్‌లతో పాటు నాయుడు స్వర్ణకుమార్, మట్టా రమేష్, నాయుడు దుర్గాప్రసాద్, ఈడా నాగయ్య, యార్లగడ్డ దుర్గాప్రసాద్ కత్తులు, కర్రలతో బుధవారం రాత్రి తమ ఇంటిపై దాడిచేసి తమను చంపుతామంటూ భయభ్రాంతులకు గురి చేశారని వెంకట లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త స్థానికంగా లేని సమయంలో తనపై ఈ విధంగా దాడికి దిగడం, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని తక్షణం తనకు, తన భర్తకు పోలీసులు ప్రాణ రక్షణ కల్పించాలని, దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరింది. ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం, జూన్ 6: సారా విక్రయిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం తెలిపిన వివరాల ప్రకారం రాజు పోతేపల్లి గ్రామంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం తన సిబ్బందితో స్థావరం పై దాడి చేశామన్నారు ఈ దాడిలో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

బాలకృష్ణను సత్కరించిన అంబికా కృష్ణ


బాలకృష్ణను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ

ఏలూరు కార్పొరేషన్, జూన్ 6: సినీ నటుడు బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గంలో మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ విజయవాడలో బాలకృష్ణను కలసి శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువాతో బాలకృష్ణను సత్కరించారు. అంబికా సంస్థ ద్వారా తయారైన అగరబత్తి కిట్‌ను బాలకృష్ణకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలిచ్చిన అధికారం ప్రజాసేవకే అంకితం


చింతమనేనికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సొంగా రోషన్‌కుమార్

పెదవేగి, జూన్ 6: ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజాసేవకే అంకితమిద్దామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. చింతలపూడి ఎమ్మెల్యేగా ఎన్నికైన సొంగా రోషన్‌కుమార్ గురువారం చింతమనేని ప్రభాకర్‌ను కలిసి అభినందించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనతో విసిగి వేశారిన ప్రజలు మంచి చేస్తామనే నమ్మకంతో మనల్ని గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. అదే ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని కల్పిస్తుందని, ఐదేళ్ళ రాక్షస పాలనకు తెరపడిన నేపథ్యంలో సంక్షేమ పాలన రుచిని ప్రజలకు చూపిద్దామని ప్రభాకర్ అన్నారు.

జిల్లాలో వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 6: జిల్లాలో నేర నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు రాష్ట్ర, జాతీయ రహదారులపై బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు గస్తీ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు ప్రమదాల నివారణ కోసం డ్రైవర్లక ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో సారా, మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. ఏటీఎం, దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద అప్రమత్తంగా గస్తీని పోలీసులు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. రాత్రివేళ లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అనుమానాస్పదంగా ఉన్నవారిని గుర్తించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ఈ చర్యలను చేపట్టినట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో విద్యా శాఖ తనిఖీలు


ప్రైవేటు స్కూలు రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

భీమడోలు, జూన్ 6: మండల పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో విద్యా శాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ గుర్తింపు, తరగతి గదులు, రికార్డులను విద్యార్థుల సంఖ్య, వసతుల కల్పన తదితర అంశాలపై భీమడోలు ఎంఈవోలు శ్రీనివాస్, భాస్కర్, పలువురు సిబ్బంది పరిశీలించారు. ప్రభుత్వ అనుమతి ఉంటేనే పాఠశాల నిర్వహణ కొనసాగించాలన్నారు. రవీంద్రకుమార్, భువనేశ్వరరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంపై పట్టు కలిగి ఉండాలి


పేపర్లతో బొమ్మలు తయారుచేసిన విద్యార్థులు

లింగపాలెం, జూన్ 6: విద్యార్థులు గణితంలో పట్టు కలిగి ఉండాలని గ్రంథాలయ అధికారి సీహెచ్.వెంకటరమణ అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు పలు నీతికథలు చదివి వినిపించారు. విద్యార్థులకు పేపర్, చార్ట్‌లతో బొమ్మలు చేయడంపై మెలకువలు తెలిపారు. పేపర్లతో ఫ్లవర్‌వాజులు, బొమ్మ పడవలు, పక్షుల బొమ్మలను తయారు చేయడం నేర్పించారు. అనంతరం ఇంగ్లిష్, తెలుగు వ్యాకరణంపై పోటీ పరీక్షలు నిర్వహించారు. రీసోర్స్‌పర్సన్ బాలవెంకట సుబ్బారావు, జ్యోతిప్రియాంక, ఏ.వి నారాయణ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ సెంటర్ అద్దాలు ధ్వంసం

ద్వారకాతిరుమల, జూన్ 6: వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్ అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు కొందరు గురువారం ధ్వంసం చేశారు. గుణ్ణంపల్లిలో ఈ సెంటర్‌లో పని చేస్తున్న సిబ్బంది భోజనం చేస్తున్న సమయంలో సమీపంలో ఉన్న జామాయిల్ తోట వైపు నుంచి రాళ్లు వచ్చి సెంటర్‌పై పడ్డాయి. రాళ్ల తాకిడికి అద్దాలు పగిలిపోవడంతో సిబ్బంది బయటకు వచ్చి పరిశీలించారు. ఎవరూ కన్పించలేదని వారు తెలిపారు.


ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన డ్రెయిన్

ప్రభుత్వాసుపత్రి ఆవరణలో డ్రెయిన్ నిర్మాణం

రక్షణ చర్యలు మరిచారు

రోగులకు పొంచి ఉన్న ప్రమాదం

ఏలూరు క్రైం, జూన్ 6: ప్రభుత్వాసుపత్రి ఆవరణలో వర్షం నీరు తొలగడానికి వీలుగా డ్రెయిన్ ఏర్పాటు చేశారు. డ్రెయిన్ కూడా మునిగితే రోగులు అందులో పడిపోయే ప్రమాదం నెలకొంది. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షం పడినా ఆసుపత్రి ఆవరణ మునిగిపోతుంది. నీరు చేరిపోతోంది. వర్షపునీరు ఆస్పతి లోపలికి చేరుతుంది. నీటిని తొలగించడానికి తాత్కాలిక మోటార్లను ఏర్పాటు చేయాలి. కొన్నేళ్లుగా ఆసుపత్రి ఇంజనీరింగ్ అధికారులు తాత్కాలిక చర్యలే తీసుకున్నారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ ఆసుపత్రిగా మార్పు చెందడంతో ఆసుపత్రి ఆవరణలో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆసుపత్రి ఓపీ విభాగాలపై నీటిని బయటకు పంపించడానికి మూడు అడుగుల వెడల్పుతో డ్రెన్ తవ్వి సిమెంటు చేశారు. వర్షం నీటికి డ్రెయిన్ మునిగిపోతే పాదచారులు, వాహనదారులకు తెలియదు. కనీసం డ్రెయిన్ పక్కన ఐరన్ గ్రిల్స్ కూడా లేకపోవడంతో వర్షపునీటితో ఆసుపత్రికి వచ్చే రోగులు, వాహనాలు డ్రెయిన్‌లో పడే ప్రమాదం ఉంది.

ఆసుపత్రిలో ముంపు నీరు పోవడానికి అండర్ గ్రౌండ్ పైపులైను ఏర్పాటుకు ప్రణాళిక నిలిచిపోయింది. ఆసుపత్రి మార్చురీ నుంచి వివిధ విభాగాల నుంచి వెళ్లే నీరు తమ్మిలేరులో కలవడం, ఆ నీరు తిరిగి మంచినీటి చెరువులకు వెళ్ళడం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. భూగర్భ ట్యాంక్‌ను ఆసుపత్రి ఆవరణలోనే ఏర్పాటుచేసి శుద్ధి చేసిన తరువాత నీటిని బయటకు పంపించాలని గతంలో కాన్పూరు నుంచి వచ్చిన ఐఐటి ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. అంతలోనే మెడికల్ కాలేజీ రావడం, ఆసుపత్రి మెడికల్ కాలేజీ అనుబంధ టీచింగ్ ఆసుపత్రిగా మారడంతో అన్ని మార్పులు అయిపోయాయి. కానీ ప్రస్తుతం ఏర్పాటు చేసిన రక్షణ లేని డ్రెన్ వల్ల ఏ రోజు అయినా రోగులకు ప్రమాదం పొంచి ఉంది.


బడేటి చంటిని సత్కరించిన ఎలక్ట్రికల్ వర్కర్స్


గుడిపాడులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన నేతలు


జంగారెడ్డిగూడెంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


ప్రగడవరంలో కేక్‌కట్ చేసిన టీడీపీ శ్రేణులు

టీడీపీ, జనసేన శ్రేణుల

సంబరం

గెలుపొందిన ఎమ్మెల్యేలను కలసి అభినందనలు

గ్రామాల్లో కేక్ కట్ చేసి వేడుకలు

ఏలూరు రూరల్, జూన్ 6: ఏలూరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన బడేటి చంటిని క్యాంప్ కార్యాలయంలో గురువారం పలువురు ఘనంగా సత్కరించారు. ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్‌యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హేలాపురి, ప్రైవేట్, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చంటిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. బత్తిన శ్రీనివాసరావు, ఎం.శంకర్‌రావు, కె.దేవరాజు, రవి తదితరులు ఉన్నారు. నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు చందనాడ నందీశ్వరరావు, రంభ శ్రీనివాస్, పొన్నాడ మురళీ, తదితరులు కలసి అభినందించారు.

గుడిపాడులో టీడీపీ జోష్

పెదపాడు: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని గుర్తించిన ప్రజలు తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పట్టారని మోరు శ్రావణి అన్నారు. గుడిపాడులో గురువారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పాలభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ మోరు మాణిక్యం మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారని, టీడీపీ గెలుపుతో రాష్ట్రానికి స్వేచ్ఛ లభించిందన్నారు. అనంతరం బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో జయమంగళ నాగేంద్ర శ్రీనివాసరావు, మోరు మురళి, మోరు దశరథ్, పెద్దసంఖ్యలో కూటమి శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

బుట్టాయగూడెం: రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రజలంతా కూటమికి బ్రహ్మరథం పట్టారని బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వ రావు, షేక్ ముస్తఫా అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో కుంచాడ ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో కూటమి విజయాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మండవ లక్ష్మణరావు కట్ చేశారు. రాష్ట్రంలో అరాచక పాలనకు ప్రజలు ముగింపు పలికారన్నారు. కొండ్రెడ్డి కిషోర్, రావూరి కృష్ణ, చెరుకూరి శ్రీధర్, అల్లూరి రామకృష్ణ, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రగడవరంలో కేక్ కట్ చేసిన నేతలు

చింతలపూడి: కూటమి విజయంతో గ్రామాల్లో సంబరాలు కొనసాగుతున్నాయి. మండలంలోని ప్రగడవరంలో నాయీబ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాగరాజు మాట్లాడుతూ ఏపీలో ప్రజలు ఓట్ల వర్షం కురిపించారని, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్న విషయం అర్థమవుతోందన్నారు. చంద్రబాబు కుటుంబం ఎన్ని అవమానాల పాలైందో ప్రజలు చూశారని, ప్రచారంలో కూడా ఆ కుటుంబం మొత్తం ఎండల్లో శక్తివంచన లేకుండా తిరిగి చంద్రబాబు గెలిపించాలన్న పిలుపు జనసేన, బీజేపీ, టీడీపీ కలయిక ఉమ్మడిగా చేసిన కృషికి ప్రజలు నీరాజనం పలకడం విశేషం అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొనకళ్ళ వీర్రాజు, చక్రపు మారేశ్వరరావు, బి.వి శ్రీనివాసరావు, సత్యనారాయణ, త్యాగరాజు, రాఘవులు, రాంబాబు పలువురు పాల్గొన్నారు.

చిర్రి బాలరాజుకు నేతల పుష్పగుచ్ఛం

పోలవరం: ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజుని గురువారం పోలవరం మండల కూటమి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుట్టాయిగూడెంలో జనసేన నాయకులు కరాటం రాంబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గునపర్తి చిన్ని, సోమరౌతు అనితకుమారి, మల్లికార్జునరావు, పసుపులేటి అనీల్, కాత్రాజుల రమేశ్, కుడిదాల శ్రీను, కొణతాల ప్రసాద్, అమరాన్ పోశి, వీరపురాజు చిట్టిబాబు, మణికంఠ తదితరులు ఉన్నారు.

● కుక్కునూరు: పోలవరం ఎమ్మెల్యేగా గెలుపొందిన చిర్రి బాలరాజును జనసేన కార్యకర్తలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడిన కూటమి నాయకులకు, కార్యకర్తలకు చిర్రి బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే అందరిని కలిసి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, రవిప్రసాద్, లక్ష్మణ స్వామి, చల్లా కోటి, నాగరాజు, వెంకటేశ్వర్లు, రామాచారి పాల్గొన్నారు.


చిర్రి బాలరాజును కలసిన పోలవరం నాయకులు

ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గెలుపులో కీలకపాత్ర పోషించిన టీడీపీ మండల అధ్యక్షుడు మునిశెట్టి నాగేశ్వరరావును నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. అనంతరం స్వీట్లు పంచారు. నాయకులు కోటగిరి సత్యనారాయణ, శ్రీనివాసరావు, శివయ్య, భాస్కరరావు, రాజు, బాలాజీ, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: ఎమ్మెల్యేగా గెలుపొందిన చిర్రి బాలరాజును బర్రింకలపాడులోని ఎమ్మెల్యే స్వగృహంలో టి.నరసాపురం మండల జనసేన నాయకుడు అడపా నాగరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు కలసి అభినందనలు తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ బాలరాజు విజయానికి కృషిచేసిన జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపిన వారిలో శ్రీరామవరం, కృష్ణాపురం, కాపుగూడెం, మక్కినవారిగూడెం తదితర గ్రామాలకు చెందిన నాయకులు ఉన్నారు.

ధర్మరాజుకు గజమాలతో సత్కారం

ఉంగుటూరు: కూటమి తరపున ఉంగుటూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును జనసేన కార్యాలయంలో గణపవరం మండలం వరదరాజపురం గ్రామ నాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కలిగట్ల వెంకట దుర్గారావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వ్యాఖ్యలపై టీడీపీ ఆగ్రహం


గార్లమడుగులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెదవేగి, జూన్ 6: ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని గార్లమడుగు టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. గార్లమడుగు పంచాయతీ సూర్యారావుపేట గ్రామానికి చెందిన యలమంచిలి ప్రవీణ్ అప్పుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి ప్రకాశరావు పోలీసులకు ఫిర్యాదు చేశారని, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దీనికి రాజకీయ రంగు పులిమి టీడీపీపై నెపం మోపాలని చూశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం యలమంచిలి ప్రవీణ్ తన పొలంలో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. పరామర్శకు వచ్చిన అబ్బయ్యచౌదరి టీడీపీ వేధింపుల కారణంగా ప్రవీణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. అబ్బయ్యచౌదరి ఆరోపణలపై గార్లమడుగు టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అబ్బయ్యచౌదరి ఆరోపణలను ఖండించారు. మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాత్రం టీడీపీ వేధింపులుగా చిత్రీకరించి శవరాజకీయం చేయాలని చూశారన్నారు. నీచ రాజకీయాలను మానుకోకపోతే ప్రజలు నియోజకవర్గం నుంచి తరిమేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. టీడీపీ నాయకులు కొల్లి సత్యనారాయణ చౌదరి, మూతినేని గణేష్, గోళ్ళ రమేష్, పర్వతనేని చంటి, మేడికొండ సీతారామదాసు, పెన్మెత్స శివరామరాజు, ఈడ్పుగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ద్వారకా తిరుమల, జూన్ 6: క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు త్రయాహ్నిక దీక్షతో జరుగుతాయని ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 14న గణపతి పూజ, అంకురార్పణ, జరుగుతాయన్నారు. ఈనెల 15న హోమాలు. జరుగన్నాయి. 16న ఉత్సవమూర్తికి నవకలశ స్నపన, శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ. హోమాలు, మహాపూర్ణాహుతి ఆశీర్వచనం, పండిత సత్కారం జరుగనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు భైరవస్వామి వివరించారు.

చిన వెంకన్న ఆలయంలో తగ్గిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జూన్ 6: శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ గురువారం బాగా తగ్గింది. అమావాస్య కారణంగా భక్తుల రాక తగ్గి ఉండవచ్చని ఆలయ అధికారులు భావిస్తున్నారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికుల లేమితో వెలవెలబోయాయి. నామమాత్రంగా భక్తులు ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ధన్వంతరి వైద్య భగవానుడికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 6: పవరుపేట స్టేషన్ రోడ్డులో ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద భక్తులు గురువారం సామూహిక అభిషేకాలు నిర్వహించారు. దోషనివారణ పూజలు చేశారు. సూర్య నమస్కారాలు చేసి ఆలయ ప్రదిక్షణ చేశారు. ఆలయ అర్చకులు ఆది భక్తులతో అర్చనలు, పూజలు జరిపించారు. ఆ మేరకు ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.

ఆదివారపుపేట షిరిడీ సాయి మందిర్ వద్ద గురువారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బాబా వారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు బాబా వారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం పుష్పాలంకరణ చేశారు.

జనసేన నేత అప్పలనాయుడికి సత్కారం



అప్పలనాయుడి సత్కరిస్తున్న అభిమానులు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయానికి కృషి చేసిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పల నాయుడును గురువారం స్థానిక పవరుపేటలోని జనసేన కార్యాలయంలో అభిమానులు సత్కరించారు. అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఘర్షణలకు పాల్పడవద్దని, కూటమి ఇచ్చిన హామీలు త్వరలోనే అమలవుతాయని చెప్పారు. పార్టీ ప్రయోజనాల కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.

రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 6: అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఈనెల 8న ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు లయన్స్ ప్రతినిధులు మానేపల్లి రామారావు తెలిపారు. ఆయుర్వేద వైద్యుడు బీవీఎం.నగేష్ కౌన్సెలింగ్ నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు సలహాలు, సూచనలు ఇచ్చి మందులు అందజేస్తారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక సూచనలు, సలహాలు, మందులు ఇస్తారని రామారావు తెలియజేశారు.

సీపీఐ ఎంఎల్ కార్యకర్తల సమావేశం

బుట్టాయగూడెం, జూన్ 6: పోలవరం నియోజకవర్గంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అభ్యర్థి సరియం రామ్మోహన్ తరపున ప్రచారం చేసి సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికి పార్టీ సీనియర్ నాయకుడు ధర్ముల సురేష్ ధన్యవాదాలు తెలిపారు. గురువారం కేఆర్ పురంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందలాది మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి ప్రచారం చేశారని రెండు రోజులపాటు 600 మంది మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ప్రచార సామగ్రికి నిధులు సమకూర్చిన వారికి, విరాళాలు ఇచ్చినవారికి ధన్యవాదాలు తెలిపారు. సరియం రామ్మోహన్, కేవీ.రమణ, పి.శ్రీనివాస్, వెట్టి భారతి, పి.లత, వి.సద్గురు, ఈ.భూషణం, జి.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో అధిక మార్కులు సాధించిన సిరి ప్రియ



ఏలూరు కలెక్టరేట్, జూన్ 6: నీట్‌లో ఏలూరు తూర్పువీధికి చెందిన విద్యార్థిని యర్రా సిరిప్రియ అధిక మార్కులు సాధించారు. 720 మార్కులకు 705 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. సిరిప్రియ తల్లిదండ్రులు వై.వి.శివరామకృష్ణ, వై.వి లక్ష్మికామేశ్వరి ఇద్దరు వైద్యవృత్తిలోనే కొనసాగుతున్నారు. ఉత్తమ మార్కులు సాధించిన సిరిప్రియను నగరప్రముఖులు పలువురు అభినందించారు.

చట్టబద్ధమైన దత్తతతోనే పిల్లలకు హక్కులు

ఏలూరు కలెక్టరేట్, జూన్ 6: చట్టబద్ధమైన దత్తత తీసుకోవడం ద్వారానే సహజంగా పుట్టినబిడ్డలకు సంక్రమించే అన్ని చట్టబద్ధమైన హక్కులు సంక్రమిస్తాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో 11 నెలలు, 4నెలల పాపలను కర్ణాటక రాష్ట్రానికి చెందిన తల్లిదండ్రులు, తమిళనాడుకు చెందిన తల్లిదండ్రులకు ఇద్దరు పిల్లలను దత్తత ఇచ్చారు. ఫైనల్ అడాప్షన్ ఆర్డర్‌ను కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ వారికి అందించారు. ఏ ఒక్కరూ అక్రమ మార్గంలో దత్తత కొరకు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. జిల్లా మహిళా శిశుసంక్షేమ సాధికారత అధికారి కె.పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్.సూర్యచక్రవేణి, సిబ్బంది జాహ్నవి, రాజేష్, రాజ్‌కుమార్, శిశుగృహ సోషల్ వర్కర్ వెంకట రత్నమ్మ పాల్గొన్నారు.

నిత్యపారాయణ గ్రంథం భగవద్గీత


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

ఏలూరు కల్చరల్, జూన్ 6: వైఎంహెచ్‌ఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు 40 రోజులు వేసవి శిక్షణలో భాగంగా ఆధ్యాత్మిక ప్రవచనకర్త హరి శ్రీనివాస శాస్త్రి భగవద్గీతపై తరగతులు నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వైఎంహెచ్‌ఏ కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మద్య సూర్యకాంతారావు, అధ్యక్షుడు వై.సోమలింగేశ్వరరావు మాట్లాడారు. భగవద్గీత పారాయణం ద్వారా గీతా సారాంశంలో ఎంతో విలువైన జీవన విధానం, విలువలు తెలుసుకోవాలని ఆయన అన్నారు. మనిషి జీవన విధానానికి భగవద్గీత చదవడం ఉపయోగకరమన్నారు. శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ ప్రతినిత్యం పారాయణ గ్రంథం భగవద్గీత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేమా కోటేశ్వరరావు, ఎం.వి రవీంద్ర, ఎం.సూర్యనారాయణ, ఎస్.కృష్ణచైతన్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీకి చేరుకున్న దోమల నిర్మూలన మందు


యూనిట్ ఆఫీసులో దోమల మందు

బుట్టాయగూడెం, జూన్ 6: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. దోమల నిర్మూలన మందు (మలాథియాన్) 30 టన్నులు గురువారం ఏజెన్సీకి వచ్చినట్లు జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి జె.సురేష్‌కుమార్ తెలిపారు. బుట్టాయగూడెం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసు స్టోర్ రూమ్‌లో భద్రపరిచామన్నారు. జూన్ నుంచి మలేరియా జ్వరాలు వస్తుంటాయని ముందు జాగ్రత్త చర్యగా మలాథియాన్ మందును అందుబాటులో ఉంచుకుని ఏజెన్సీలోని ఐదు మండలాలతోపాటు జిల్లాలో కూడా వాడడం జరుగుతుందన్నారు. ముందుగా మలేరియా జ్వరాలు వచ్చిన గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయడం ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంవో పి.శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీస్ వి.పెద్దిరాజు ఉన్నారు.


విద్యుత్ సరఫరా లేక బ్యాంకు సర్వర్లు డౌన్

వేచివున్న పింఛన్‌దారులు

పోలవరం, జూన్ 6 : పోలవరం మండలంలో బ్యాంకుల వద్ద గురువారం పెన్షన్ సొమ్ముల కోసం పింఛనుదారులు పడిగాపులు పడ్డారు. మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో పింఛన్లు అందుకుని బయట పడ్డారు. బుధవారం వీచిన ఈదురు గాలులకు మండలంలో పలుచోట్ల విద్యుత్ లైన్లు తెగిపడిన నేపథ్యంలో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పోలవరం స్టేట్ బ్యాంకు గూటాల కెనరా బ్యాంకులలో ఇన్వర్టర్ల సామర్థ్యం చాలక సర్వర్లు మొరాయించడంతో బ్యాంకుల సేవలలో అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో బ్యాంకు సేవలు కొనసాగాయి. కొంతమంది వినియోగదారులు ఉదయం నుంచి వేచిచూసి వెనుదిరిగి వెళ్ళారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన అధికారులు

పోలవరం మండలంలో బుధవారం వీచిన ఈదురు గాలులకు రోడ్లు, విద్యుత్ స్థంబాలపై చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ లైన్లు తెగిపడి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గురువారం విద్యుత్ శాఖ డీఈ పి రాధాకృష్ణ ఆధ్వర్యంలో తెగిపడిన లైన్లు సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మండలంలో పలుచోట్ల విద్యుత్ లైన్లు తెగిపడ్డాయని 16 విద్యుత్ స్థంబాలు నేలకూలాయని వాటన్నిటినీ యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు డీఈ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ కొండా సత్యనాయణ, లైన్‌మెన్లు తగరపు రాజు, యల్లయ్య సిబ్బంది ఉన్నారు.



పోలవరంలో పడిలేచిన జనసేన

● ఓట్ల లెక్కింపులో దోబూచులాడిన మెజారిటీ ● అధికార వైసీపీని తిప్పికొట్టిన కూటమి

వేలేరుపాడు / కుక్కునూరు, జూన్ 6: పోలవరం శాసన సభాస్థానాన్ని టీడీపీ కూటమి పొత్తులో భాగంగా జనసేనకు సీటు కేటాయించడంతో అధికారపక్షమైన వైసీపీ సునాయాసంగా విజయం సాధిస్తామని ధీమాతో ఉంది. టీడీపీలో కొంత నిరాశ నెలకొంది. పోలవరంలో జనసేన విజయంపై పోలింగ్‌కు ముందు అనేక సందేహాలు. ఓట్ల లెక్కింపు సమయంలో కూడా రౌండ్ల వారీ ఫలితాల్లో మెజారిటీ ఇరుపక్షాల అభ్యర్థుల వైపు మారుతూ ఉత్కంఠ రేపింది. తుది రౌండ్లలో జనసేన పార్టీ మెజారీటి నిలుపుకుంటూ చివరికి విజయ కేతనం ఎగురవేసింది.

ఉత్కంఠగా సాగిన లెక్కింపులో వైసీపీకి కొన్ని మండలాల్లో మెజారిటీ సాధించింది. 18వ రౌండు తరువాత జనసేన ఆధిక్యంలోకి రావడంతో కూటమిలో విజయోత్సాహం కనిపించింది. వేలేరుపాడు మండలంలో వైసీపీకి 6681 ఓట్లు రాగా, జనసేనకు 6476 ఓట్లు వచ్చాయి. ఇక్కడ వైసీపీ మెజారిటీ 205 ఓట్లు సాధించింది. కుక్కునూరు మండలంలో వైసీపీ 11,864 ఓట్లు సాధించుకోగా, జనసేనకు 11,622ఓట్లు లభించచడంతో వైసీపీకి 242 ఓట్లు మెజారిటీ వచ్చింది. జీలుగుమిల్లి మండలంలో వైసీపీకి 10,903 ఓట్లు, జనసేనకు 7965 ఓటకలతో వైసీపీ మెజారిటీ 2938 వచ్చింది. టి.నరసాపురం మండలంలో వైసీపీకి 17,874 ఓట్లు, జనసేనకు 20,076 ఓట్లతో జనసేనకు 2202 మెజారిటీ వచ్చింది. బుట్టాయిగూడెం మండలంలో వైసీపీకి 15,599 ఓట్లు, జనసేనకు 13,862 ఓట్లతో వైసీపీ మెజారిటీలో 1737, కొయ్యలగూడెం మండలంలో జనసేనకు 27,917ఓట్లు, వైసీపీకి 17,842 ఓట్లు రాగా జనసేనకు 10,075 మెజారిటీ లభించింది. పోలవరం మండలంలో జనసేనకు 12,055, వైసీపీకి 7,537 ఓట్లు పడగా జనసేనకు 4518ఓట్లు మెజారిటీ వచ్చింది. విలీన మండలాల్లో మాత్రమే వైసీపీ కొంత వరకు పోటీ ఇచ్చింది. నియోజకవర్గంలో జనసేనకు అంతగా పట్టులేనప్పటికి టీడీపీ అదినేత చంద్రబాబు నాయుడు పోలవరం నియోజకవర్గ నాయకులపై జనసేన గెలుపు బాధ్యత అప్పగించారు. ఇక్కడ మిత్రపక్షం గెలవడమే ముఖ్యమని మీ భవిష్యత్తుకు నేనున్నానంటూ గట్టి హామీ ఇవ్వడంతో కూటమిలోని టీడీపీ, బీజేపీ నాయకులు జనసేన అభ్యర్థి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. ఐదేళ్లుగా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నిర్వాసితులను వైసీపీ ప్రభుత్వం ముప్పతిప్పలు పెట్టినా ఆపార్టీ అభ్యర్థికి ఆ మండలాల్లో మెజారిటీ రావడం ఆశ్చర్యకరం. ఈ రెండు మండలాల్లో కనీసం 10వేలు మెజారిటీ సాధిస్తామని ధీమాగా ఉన్న కూటమి నాయకులకు నిరాశ కలిగించే విషయం వైసీపీకి రెండు మండలాల్లో కలిపి 400 పైగా మెజారిటీ రావడం గమనార్హం. ఏదేమైనప్పటికి స్వల్ప మెజారిటీ దక్కిన విజయం చెందడంతో కూటమి సఫలీకృతమైంది.

టీడీపీకి ఏలూరు మండలంలో ఆధిక్యం

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గంలో ఉన్న ఏలూరు మండల గ్రామాలు ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి ఆధిక్యం ఇచ్చింది. దెందులూరు నియోజకవర్గ ఎన్నికల ఫలితాల్లో తొలిరౌండ్ నుంచి 21 రౌండ్ల వరకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరిపై విజయం సాధించారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఏలూరు రూరల్ మండలంలోని 14 పంచాయతీల ఓటర్లు చింతమనేనికి ఆధిక్యాన్ని అందిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్లులో కూడా టీడీపీ ఆధిక్యాన్ని కొనసాగించింది. మండలంలోని మల్కాపురంలో 379, చాటపర్రులో 1103, కె.డిపురంలో 265, జాలిపూడి 566, మాదేపల్లి 1025, శ్రీపర్రు 243, కలకుర్రు 61, కోమటిలంక 174, గుడివాకలంక 668, మొండుకోడు 90, పెదయాగనమిల్లి 96, పైడిచింతపాడు పంచాయతీని 160 ఓట్లు మెజార్టీ సాధించారు.



నత్తగుల్లపాడులో కేకును కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



కోరుకొల్లులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న జనసేన నాయకులు



ముదినేపల్లిలో వినోద్‌ను సత్కరించిన కూటమి నాయకులు



ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ నాయకుల పూజలు

కూటమిలో జోష్

కేక్‌లు కట్‌చేసి సంబరాలు

మొక్కులు తీర్చుకున్న అభిమానులు

కైకలూరు, జూన్ 6: కైకలూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు అత్యధిక ఓట్ల మెజార్టీని అందించిన ప్రజలందరికీ టీడీపీ కైకలూరు మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. నత్తగుల్లపాడు గ్రామంలో కొల్లేరు వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో వైసీపీ అరాచక పాలన, అవినీతిపై ప్రజలు ఓటు రూపంలో తగిన గుణపాఠం చెప్పారన్నారు. కైకలూరులో సైతం దూలం నాగేశ్వరరావు, అతని కుమారుడి అక్రమాలకు నిరసనగా ప్రజలు అత్యధికంగా 45,273 ఓట్ల మెజార్టీని కామినేనికి అందించారన్నారు. కైకలూరు మండలంలోనే 15 వేల ఓట్ల మెజార్టీని ప్రజలు అందించారంటే వారిపై ప్రజల్లో ఏ మేరకు అసంతృప్తి ఉందో గ్రహించవచ్చన్నారు. టీడీపీ నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, జయమంగళ సుబ్బరాజు, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించటంతో పాటు కైకలూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఘన విజయంపై గురువారం ముదినేపల్లిలోని టీడీపీ కార్యాలయం వద విజయోత్సవం జరుపుకున్నారు. నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన కొడాలి వినోద్‌ను నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భూపతి రవీంద్ర, బీజేపీ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు మొవ్వ ఫణీంద్ర, జనసేన నియోజకవర్గ కార్యదర్శి రవితేజ, టీడీపీ నాయకులు ముత్యాల రవి, అరుగుల సుబ్బారావు, పాగోలు విజయ్ తదితరులు వినోద్‌కు అంబేడ్కర్ పాలరాతి బొమ్మను అందజేశారు.

ఆంజనేయస్వామికి బీజేపీ నేతల పూజలు

కైకలూరు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ శాసనసభ్యుడిగా కూడా సత్ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ గురువారం ముదినేపల్లిలోని శ్రీ సువర్చలా సమేత భక్తాంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు పూజలు జరిపారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో బీజేపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ నరసింహారావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వత్తుమిల్లి ప్రసాద్ తదితరులు పూజలు జరిపారు.

కలిదిండి: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో జనసేన చారిత్రక విజయం సాధించటంపై జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టు లీలా కనకదుర్గ, పార్టీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ వెంకన్న బాబు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కోరుకొల్లులో గురువారం జనసేన నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాల్లోను గెలుపొంది చరిత్ర సృష్టించిందని, ఈ ఘనత అధినేత పవన్ కళ్యాణ్‌కి దక్కుతుందన్నారు. కామినేనికి అభినందనలు తెలిపారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పూరు నానాజీ, నాయకులు ముమ్మారెడ్డి నాగమల్లేశ్వరరావు, బోయిన ప్రశాంతి, రాజేష్ వీరంకి వెంకటేశ్వరరావు, కె.శివ, తోట లక్ష్మణ్, రమాదేవి, చెన్నంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





ఆగిరిపల్లి నుంచి దుర్గమ్మ గుడికి పాదయాత్రగా సద్గురు స్వామి (ఇన్‌సెట్) డోకిపర్రు వేంకటేశ్వర స్వామి ఆలయానికి నాగమల్లేశ్వరరావు పాదయాత్ర

మొక్కులు తీర్చుకున్న అభిమానులు

ముదినేపల్లి, జూన్ 6 : కైకలూరు నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఘన విజయం సాధించినందుకు ముదినేపల్లికి చెందిన ఆయన అభిమాని, టీడీపీ కార్యకర్త అంకెం అమల నాగమల్లేశ్వరరావు ముదినేపల్లి నుంచి గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం కాలినడకన వెళ్లి తన మొక్కు తీర్చుకున్నారు. ఎన్నికల్లో కామినేని విజయం సాధిస్తే ఆలయానికి నడిచి వచ్చి తలనీలాలు సమర్పిస్తానని నాగమల్లేశ్వరరావు మొక్కుకున్నారు. ఆయన విజయం సాధించటంతో మొక్కు తీర్చుకున్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామవాసి జలసూత్రం సద్గురుస్వామి చంద్రబాబు, నూజివీడులో పార్థసారథి గెలిచినందుకు వడ్లమాను నుంచి విజయవాడ దుర్గమ్మ అమ్మవారి గుడి వద్దకు పాదయాత్ర చేసి మొక్కు తీర్చుకున్నారు. గురువారం ఉదయం ప్రయాణమై అమ్మవారి వద్దకు పాదయాత్రగా వెళ్లారు.

రాజీనామాల దిశగా త్రిసభ్య కమిటీలు

ముదినేపల్లి, జూన్ 6 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రిసభ్య కమిటీలు రాజీనామాల బాట పట్టాయి. ప్రస్తుత త్రిసభ్య కమిటీల పదవీకాలం ఈ ఏడాది జూలై 31 వరకు ఉన్నప్పటికీ తమను నామినేట్ చేసిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోవటంతో కమిటీల అధ్యక్షులు, సభ్యులు తమ పదవులకు రాజీనామాలు చేయడం ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇప్పటికే పలు పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీలు రాజీనామా చేయగా, మరి కొన్ని సంఘాల కమిటీలు కూడా రాజీనామా చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కలిదిండి సొసైటీ ఛైర్మన్ పదవికి వడుపు రామారావు బుధవారం రాజీనామా చేయగా, రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తన పదవికి గురువారం రాజీనామా చేశారు. మరి కొంతమంది కూడా తమ నామినేటెడ్ పదవులకు రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. 2019లో ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేయగా, ప్రతి ఆరు నెలలకు ఈ కమిటీలను కొత్తగా నియమిస్తూ ఇప్పటి వరకు కొనసాగింది. గత ప్రభుత్వం నామినేట్ చేసిన ఈ త్రిసభ్య కమిటీలను రద్దు చేస్తూ కొత్తగా ప్రభుత్వం త్వరలో జీవో ఇచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే రాజీనామాలు చేస్తే గౌరవంగా ఉంటుందన్నది పీఏసీఎస్ త్రిసభ్య కమిటీల అభిప్రాయంగా ఉంది. సంఘాలకు ఎన్నికలు జరిగే వరకు పర్సన్-ఇన్-చార్జ్‌ల నియామకం జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

దేశిరెడ్డి రాజీనామా



దేశిరెడ్డి రాఘవరెడ్డి

చాట్రాయి, జూన్ 6: ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందటంతో నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గురువారం తన రాజీనామాను కమిషనర్ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్‌కు పంపారు. ఏడాదిన్నర పాటు ఆయన ఈ పదవిలో కొనసాగారు. 50 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్న దేశిరెడ్డి సర్పంచ్, పీఏసీఎస్ అధ్యక్షుడిగా, జడ్పీటీసీ, ఏఎంసీ ఛైర్మన్ తదితర పదవులు నిర్వహించారు.



ప్రతిపక్ష హోదా సైతం దక్కని జగన్ : కాపా

నూజివీడు, జూన్ 6: 151 స్థానాలతో అధికారంలోకి వచ్చిన జగన్ నేడు కనీసం ప్రతిపక్ష హోదాను కూడా పొందలేకపోవడానికి కారణం ఆయన విధ్వంసకర పాలనేనని, నూజివీడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు అన్నారు. నూజివీడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని అమరావతిని బ్రహ్మాండంగా నిర్మిస్తానన్న జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మూడు ముక్కలాట ఆడారని దీంతో ప్రజలు టీడీపీ కూటమికి విజయాన్ని అందించారన్నారు. రాజధాని రైతులు పాదయాత్ర చేస్తూ దేవుళ్లకు మొక్కిన మొర ఫలించి 151 స్థానాలు కాస్త 11 స్థానాలకు పడిపోయాయన్నారు. పోలవరం, చింతలపూడి, అమరావతి సంక్షేమ పథకాల పేరుతో జగన్‌రెడ్డి తీసుకువచ్చిన 12 లక్షల కోట్ల అప్పు పై త్వరలో జగన్‌రెడ్డి మరోసారి మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తేల్చడం జరుగుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రజలను పన్నుల పేరుతో దోచుకుందని, దీనిపై చంద్రబాబు, లోకేశ్‌లు చేసిన పాదయాత్ర, పోరాటాల ఫలితమే టీడీపీ కూటమికి లభించిన ఘన విజయమన్నారు. రాష్ట్రంలో టీడీపీ విజయం నూజివీడులో సారథికి ప్రజలు అండగా నిలవడం పై తాము ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. మాజీ సర్పంచ్‌లు చల్లగుళ్ల చిట్టిబాబు, అక్కినేని చందు, టీడీపీ నాయకులు ఒరుగు రఘు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి మద్దతిచ్చారని దాడి

రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన మహిళ

ముసునూరు, జూన్ 6: తెలుగుదేశం పార్టీకి మద్దతిస్తారా? మేమంటే భయం లేదా? అంటూ సర్పంచ్ భర్త, ఎంపీటీసీ కలసి తమ ఇంటిపై దాడికి దిగారంటూ ముసునూరు మండలం బలివేకు చెందిన మహిళ గురువారం ముసునూరు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలివేకు చెందిన తోట ఆంజనేయులు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఇతని భార్య వెంకట లక్ష్మి. తాము టీడీపీ పక్షాన ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, టీడీపీ గెలుపొందడాన్ని జీర్ణించుకోలేక సర్పంచ్ భర్త రావు సుధాకర్, ఎంపీటీసీ దాసరి సుమన్‌లతో పాటు నాయుడు స్వర్ణకుమార్, మట్టా రమేష్, నాయుడు దుర్గాప్రసాద్, ఈడా నాగయ్య, యార్లగడ్డ దుర్గాప్రసాద్ కత్తులు, కర్రలతో బుధవారం రాత్రి తమ ఇంటిపై దాడిచేసి తమను చంపుతామంటూ భయభ్రాంతులను చేశారని వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త స్థానికంగా లేని సమయంలో తనపై ఈ విధంగా దాడికి దిగడం, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని తక్షణం తనకు, తన భర్తకు పోలీసులు ప్రాణరక్షణ కల్పించాలని, దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరింది. ఎస్‌ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణిత పరీక్షకు 9 మంది విద్యార్థులు గైర్హాజరు

నూజివీడు టౌన్, జూన్ 6: ఓపెన్ టెన్త్ పరీక్షల్లో గురువారం నిర్వహించిన గణిత పరీక్షకు 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.అనూరాధ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్‌కు సంబంధించి ఓపెన్ టెన్త్ పరీక్షలను నూజివీడు సెయింట్ థామస్ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. గురువారం నాటి గణిత పరీక్షకు మొత్తం 75 మంది హాజరుకావాల్సి ఉండగా, 66 మంది హాజరయ్యారని ఆమె తెలిపారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోతిని పూడ్చారు..

నూజివీడు టౌన్, జూన్ 6:నూజివీడు ఎమ్‌అండ్‌బి రహదారి పై గల బైపాస్ రోడ్డు కల్వర్టుకు భారీ రంధ్రం ఏర్పడిన విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు స్పందించారు. ఆ రంధ్రాన్ని కాంక్రీట్‌తో మరమ్మతులు నిర్వహించారు. ఎమ్‌అండ్‌బి రహదారికి మరమ్మతులు నిర్వహిస్తున్నారు కానీ కల్వర్టుకు ఏర్పడిన గోతిని మాత్రం మరిచిపోయారంటూ కథనం ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు ఇదిగో ఇలా మరమ్మతులను నిర్వహించి పూర్తి చేశారు.

కొంపముంచిన పందేలు



ముదినేపల్లి, జూన్ 6 :సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై పందేలు కట్టిన వారు పెద్ద ఎత్తున నష్టాలకు గురయ్యారు. వైసీపీ తరపున పందాలు కట్టిన ఎంతో మంది అప్పుల పాలైనట్టు తెలుస్తున్నది. స్థానిక నియోజకవర్గం ఫలితంతో పాటు వివిధ నియోజకవర్గాల్లో గెలుపు, మెజారిటీలు, ముఖ్యమైన నాయకుల మెజారిటీలపై పందేలు కట్టిన వారు లక్షల్లోనే సొమ్మును పోగొట్టుకున్నారు. గతంలో ఏనాడు లేని విధంగా ముదినేపల్లి ప్రాంతంలో ఈ ఎన్నికల్లో పందేలు జోరుగా జరిగాయి. కళ్లెదుట ఎన్‌డీఏ కూటమి విజయం కనిపిస్తున్నా చాలా మంది పోలింగ్ ముగిశాక కూడా పందేలు కట్టారు. కైకలూరు నియోజకవర్గం నుంచి కూటమికి 20 వేల లోపే మెజార్టీ వస్తుందని చాలా మంది లక్షల రూపాయలు పందేలు కట్టగా, ఆ మెజారిటీ అనూహ్యంగా 45 వేలకు పైగా రావడంతో పెద్ద సంఖ్యలో పందేల రాయుళ్లు సొమ్ములు పోగొట్టుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ 14 సీట్లు మాత్రమే వస్తాయని ఒక సర్వే సంస్థ చెప్పిన ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మకుండా, ఆ పార్టీకి 94 నుంచి 104 సీట్లు వస్తాయని మరో సర్వే సంస్థ వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మి ముదినేపల్లి ప్రాంతంలో చాలామంది చివరిలో పందేలు కట్టి పెద్ద ఎత్తున నష్టపోయారు. ఓట్ల లెక్కింపునకు రెండు రోజులు ముందు కూడా పందేలు పెద్ద ఎత్తున జరిగాయి. ఎన్‌డీఏ తరపున పందేలు కట్టే వారు ఒకటికి నాలుగు, ఐదు రెట్లు ఇస్తామనడంతో వైసీపీ తరపున పందేలు కట్టే వారు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చారు. నష్టపోయిన వారు ఎక్కువ శాతం మంది మధ్యతరగతి వారే ఉన్నట్లు తెలుస్తోంది. కొంతమంది బంగారం తాకట్టు పెట్టి మరీ పందేలు కట్టినట్లు సమాచారం.

క్రైం సమాచారం

పాముకాటుతో కూలీ మృతి

ముసునూరు, జూన్ 6: మండలంలోని సింహాద్రిపురం గ్రామ సమీపంలో ఉన్న కోళ్ళ ఫారంలో కూలి పని చేసుకునేందుకు మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన సంజయ్ యాదవ్(26) పాము కాటుకు గురై అస్వస్థతకు గురయ్యాడు. సహచర కార్మికులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.వాసు తెలిపారు.



కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు పరిశీలిస్తున్న కామినేని

100 గ్రామాల్లో కూటమిదే పైచేయి

వైసీపీకి 11 గ్రామాల్లోనే..

కొల్లేరు గ్రామాల్లోను కామినేనికే మెజార్టీ

కైకలూరు, జూన్ 6: ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి దుమ్మురేపింది. ఊహించని మెజార్టీతో కూటమి ఘనవిజయం సాధించింది. నియోజకవర్గంలో ఇప్పటివరకు ఏ అభ్యర్థికి రాని అత్యధిక మెజార్టీ రావడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఆయన కుమారుడి నియంతృత్వ వైఖరికి ప్రజలు విసిగిపోయి నిశ్శబ్దంగానే తమ ఓట్లను కూటమికి వేశారు. దీంతో సర్వేలకు సైతం అంతుచిక్కకుండా భారీ మెజార్టీని డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు ప్రజలు అందించారు. నియోజకవర్గంలో 110 గ్రామ పంచాయతీలకు గాను 11 పంచాయతీల్లోనే వైసీపీకి మెజార్టీ చూపించారు. 100 గ్రామాల్లో పదులు, వందలు, వేల సంఖ్యలో మెజార్టీని కామినేనికి కట్టబెట్టారు. ఎప్పుడూ కాంగ్రెస్‌కు, వైసీపీకి మెజార్టీ వచ్చే మండవల్లి మండలం సైతం సుమారు 7 వేల ఓట్లు మెజార్టీ రావడంతో నియోజకవర్గంలోని కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాలతో కలుపుకొని 45,273 ఓట్ల మెజార్టీని అందించారు. కైకలూరు మండలంలో పల్లెవాడ, రామవరం, మండవల్లి మండలంలో నందిగామలంక, మణుగులూరు, ప్రత్తిపాడు, తక్కెళ్ళపాడు, చింతలపూడి, పసలపూడి, మూడుతాళ్ళపాడు, పెరికేగూడెం, ముదినేపల్లి మండలం వి.రావిగుంటలో వైసీపీకి మెజార్టీ వచ్చాయి. మిగిలిన 100 గ్రామాల్లోనూ కూటమికి భారీ ఆధిక్యతను అందించారు. దూలం నాగేశ్వరరావు ఓటు వేసిన పోలింగ్ బూత్ 119లో 1328 ఓట్లు పోల్ అవ్వగా 716 ఓట్లు కామినేనికి రాగా కేవలం 261 ఓట్లు మాత్రమే దూలంకు వచ్చాయి. అంటే 455 ఓట్లు కూటమికి మెజార్టీ వచ్చింది. కామినేని స్వగ్రామం వరహాపట్నంలో రెండు బూత్‌లకు గాను 691 ఓట్ల మెజార్టీని అందించారు. దూలం నాగేశ్వరరావు స్వగ్రామమైన కైకలూరు పట్టణంలో కూటమికి 4330 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇదే తరహాలో అన్ని గ్రామాల్లోనూ కూటమికి మెజార్టీ వచ్చింది. దీంతో కామినేనికి 60.33 శాతం రాగా దూలం నాగేశ్వరరావుకు 35.41 శాతం మాత్రమే ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు నోబుల్‌కు 2442ఓట్లు పోల్ అయి 1.36 శాతం వచ్చాయి. వీటితో పాటు నోటాకు సైతం 1588 ఓట్లు వచ్చాయి.

కొల్లేరులోనూ కూటమిదే పైచేయి...

కైకలూరు, కలిదిండి మండలాల్లోని కొల్లేరు గ్రామాల్లో 12 పోలింగ్ బూత్‌లు ఉండగా వాటిలో 12,576 ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో 4449 ఓట్లు మెజార్టీ కామినేనికి అందించారు. ఎన్నికల సమయంలో కొల్లేరు గ్రామాల్లో ఓటు బ్యాంకు ఆది నుంచి కూటమికే ఎక్కువ శాతం ఓట్లు పోల్ అవుతాయని జరిగిన ఊహాగానాలకు తగినట్లుగానే మెజార్టీని సైతం కూటమి సాధించింది. కొల్లేరు గ్రామాల్లో ప్రజలు ఎప్పుడూ టీడీపీ వైపు మొగ్గు చూపుతారని మరోసారి ఆ గ్రామ కట్టుబాట్ల మధ్య నిరూపితమైంది.

కలిదిండి: కలిదిండి మండలంలో కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కి 12,607 ఓట్ల మెజార్టీ వచ్చింది. కోరుకొల్లులో అత్యధికంగా 2,473 ఓట్ల ఆధిక్యం లభించింది. మండలంలో మొత్తం 23 గ్రామపంచాయతీల్లో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కి మెజార్టీ లభించింది.

వంతెనపై పేర్ల చెరిపివేత



కైకలూరు, జూన్ 6: వైసీపీ హయాంలో నిర్మించిన వంతెనలకు రంగులు మార్చే పనులను టీడీపీ, జనసైనికులు తీసుకున్నారు. ఇటీవల కైకలూరులో కోరుకొల్లు రోడ్డులోని పంటకాలువపై మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఇంటి సమీపాన, ఎస్టీ కాలనీలో రెండు వంతెనలను నిర్మించారు. అయితే ఈ వంతెనలకు దూలం నాగేశ్వరరావు తన పేరు తన తండ్రి దూలం వీరన్న పేరు పై నిర్మించినట్టు పేర్లు రాసుకున్నారు. అయితే వంతెనల నిర్మాణానికి పంచాయతీ, మండల పరిషత్ నిధులతో నిర్మించిన ఈ వంతెనలకు సొంత పేర్లు పెట్టుకోవడంతో టీడీపీ, జనసైనికులు ఆగ్రహించి వంతెనకు పేర్లను చెరిపివేస్తూ కొత్త రంగులు వేశారు. ఈ వంతెనలకు జాతీయ నాయకుల పేర్లను పెడుతున్నట్టు తెలిపారు. సొంత డబ్బులతో నిర్మించిన వాటికే పేర్లు పెట్టుకోవాల్సి ఉండగా అధికార బలంతో దూలం నాగేశ్వరరావు వారి పేర్లే పెట్టుకున్నారని ఇకపై ఈ వంతెనలకు జాతీయ నాయకుల పేర్లు పెట్టి పిలవడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ నాయకుల పేర్లపై గ్రామ పంచాయతీలో తీర్మానం చేస్తామన్నారు. టీడీపీ నాయకులు పూల రామచంద్రరావు, మంగినేని రామకృష్ణ, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, శొంఠి రాజేశ్వరి తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నిలిచిన ట్రాఫిక్‌తో ప్రజల వెతలు



ముదినేపల్లి రూరల్, జూన్ 6: బంటుమిల్లి సింగ రాయపాలెం ప్రధాన రహ దారి ఉప్పరగూడెం సమీపం లో వంతెన వద్ద ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం వంతెన పై లారీ, కారు ఎదురెదురుగా ఒకేసారి రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. లారీ డ్రైవర్ ఎదురుగా వచ్చే కారుని గమనించకపోవడంతో ఈ ఘటన జరిగినట్టు సమాచారం. వాహనదారులు, పోలీసులకు ఫోన్‌చేసి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నూజివీడు డివిజన్‌లో భారీ వర్షం

నూజివీడు టౌన్, జూన్ 6: నూజివీడు డివిజన్ వ్యాప్తంగా బుధవారం రాత్రి భారీ వర్షం నమోదైంది. అత్యధికంగా ముసునూరు మండలంలో 104.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా చాట్రాయి మండలంలో 3.2 మిల్లీమీటర్లు నమోదైంది. ఇక లింగపాలెంలో 73.2, నూజివీడు మండలంలో 72.8 మిల్లీమీటర్లు, చింతలపూడి మండలంలో 27.4, చాట్రాయి మండలంలో 3.2, ఆగిరిపల్లి మండలంలో 5.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా 347 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సరాసరి 57.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఈదురు గాలి.. భారీ వర్షం

నేలకొరిగిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు

ముసునూరు మండలంలో ప్రజల వెతలు

ముసునూరు, జూన్ 6: మండలంలో ఈదురుగాలులతో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం బీభత్సాన్ని సృష్టించింది. పలు గ్రామాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరగడంతో పాటు విద్యుత్ లైన్‌లు ధ్వంసమయ్యాయి. దీంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. రహదారుపై భారీ వృక్షాలు కూలిపోడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముసునూరు, చింతలవల్లి, గోగులంపాడు తదితర గ్రామాల్లో రహదారులపై కూలిన భారీ వృక్షాలను అయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. 27 విద్యుత్ స్తంభాలు, ఏడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగి విద్యుత్ లైన్లు ధ్వంసమయ్యాయి. వీటి విలువ సూమారు రూ.9 లక్షలు ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ఆకుల హేమసుందర్‌కుమార్ తెలిపారు. భారీ వర్షానికి అన్ని రహదారులు చెరువులను తలపించాయి. రమణక్కపేట, గుడిపాడు మొండివాగు బీసీకాలనీ, సూరేపల్లిలో పలు కాలనీల్లో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. అధికారులు సహాయక చర్యలు చేపట్టి వర్షపునీటి తొలిగించారు.

పొంగిపొరలిన వాగులు

మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఇప్పటి వరకు అరకొరగా ఉన్న చెరువుల్లో నీరు చేరింది. నైరుతి రుతుపవనాల వల్ల మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో చెరువులు పూర్తిస్థాయిలో నిండుతాయనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

మార్జిన్‌లో కూరుకుపోయిన పాల వాహనం

ముసునూరు, జూన్ 6: ముసునూరు ప్రధాన రహదారి శివారు మసీదు వద్ద మార్జిన్‌లో గురువారం తెల్లవారుజామున విజయ పాల వాహనం కూరుకుపోయింది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఈ రహదారిలో వృక్షాలు అక్కడక్కడ కూలి రహదారిపై పడటంతో వీటిని తప్పించే క్రమంలో మార్జిన్‌లోకి వెళ్లడంతో పాల వాహనం కురుకుపోయింది. గురువారం తెల్లవారుజామున సూమారు 3 గంటలకు ఈ ఘటన జరిగింది. ఎక్స్‌కవేటర్ సహాయంతో వాహనాన్ని బయటకు తీశారు. దుకాణాలకు తెల్లవారుజామున వెళ్లాల్సిన పాలు, పెరుగు ప్యాకెట్లు ఆలస్యంగా చేరాయి.



ముసునూరు ప్రధాన రహదారిలో కూలిన వృక్షం

మండవల్లిలో భారీ వర్షం... ఆక్వా రైతుల పాట్లు

మండవల్లి: మండవల్లిలో బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భయభ్రాంతులకు గురిచేసింది. వర్షం దెబ్బతో పలుమార్లు విద్యుత్ నిలుపుదల చేశారు. వర్షపు నీటితో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రొయ్యల చెరువుల వద్ద జనరేటర్లకు ఆయిల్ నిమిత్తం రైతుల అవస్థలు వర్ణనాతీతం. డొంకరోడ్లలో వర్షం దెబ్బతో మోటార్ సైకిల్‌పై రాకపోకలు సాగించలేక కాలినడకన ఆయిల్ క్యాన్లతో జోరున వానలో ఆక్వారైతులు అవస్థలు పడ్డారు. మండవల్లి సమీపంలో పిడుగు పాటుకు ఆక్వా చెరువులపై ఏర్పాటుచేసిన విద్యుత్ మోటార్లకు అమర్చిన టైమర్లు పేలిపోయాయి. దీంతో చెరువుల్లోని ఏరియేటర్లు ఆగిపోయాయి. విద్యుత్ పునరుద్ధరణకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దిగమర్రు, పామర్రు జాతీయ రహదారిలో మండవల్లి వద్ద వర్షపు నీటితో జలమయం అయింది. అలాగే మండవల్లి మండలం నుండి ఇంగిలిపాకలంక వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారిలో మండవల్లి రైల్వేగేటు వద్ద రోడ్డుపై వర్షంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

కమల లక్ష్మికి సత్కారం



ఆగిరిపల్లి, జూన్ 6: ఆగిరిపల్లి ఆర్యవైశ్య మహిళా మండలి గురువారం నూజివీడు ఎమ్మెల్యే పార్థసారథి సతీమణి కమల లక్ష్మిని సత్కరించారు. ఈ సందర్భంగా కమల లక్ష్మి మాట్లాడుతూ సారథి ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తారన్నారు. తాను మహిళ సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతానని మాటిచ్చారు.

సుపరిపాలన కోసమే కూటమికి పట్టం



బొట్టు వరలక్ష్మి టీడీపీ మండల అధ్యక్షురాలు

చాట్రాయి, జూన్ 6: వైసీపీ అరాచక అవినీతి పాలనకు విసిగిపోయిన ప్రజలు సుపరిపాలన కోసం కూటమికి పట్టం కట్టారని టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైసీపీకి గట్టి పట్టు ఉన్న చాట్రాయి మండలంలో, ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమన్వయంతో పనిచేయటం వల్ల మండలంలో టీడీపీ 1047 ఓట్ల మెజారిటీ సాధించిందన్నారు. నూజివీడు ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్‌యాదవ్ భారీ మెజారిటీతో గెలుపొందటంతో నూజివీడు నియోజకవర్గానికి, ఏలూరు జిల్లాకు మహర్దశ రానున్నదన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే చింతలపూడి ఎత్తిపోతల పథకం, తమ్మిలేరు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు పునః ప్రారంభమై గోదావరి జలాలతో చాట్రాయి మండలంతో పాటు మెట్ట ప్రాంతం సస్యశ్యామలమై బంగారు పంటలు పండుతాయన్నారు. ప్రపంచంలో గొప్ప పరిపాలనాదక్షుడైన చంద్రబాబు సారథ్యంలో నవ్యాంధ్ర స్వర్ణాంధ్రగా అభివృద్ధి చెంది దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే పార్థసారథికి అభినందనల వెల్లువ

ముసునూరు, జూన్ 6: నూజివీడు నియోజకవర్గ శాసనసభ్యుడిగా విజయం సాధించిన కొలుసు పార్థసారథికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ముసునూరు మండలంలోని కాటేనిపాడు, గోపవరం, వేల్పుచర్ల, రమణక్కపేట, గుడిపాడు, చెక్కపల్లి, వలసపల్లి, ముసునూరు తదితర గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సీనియర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు నూజివీడు టీడీపీ పార్టీ కార్యాలయంలో సారథిని కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి, పూలమాలలు వేసి సన్మానించి, అభినందనలు తెలిపారు.



'కాగిత'కు ముదినేపల్లి నేతల అభినందన

కైకలూరు, జూన్ 6 : పెడన అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన కాగిత కృష్ణప్రసాద్‌ను ముదినేపల్లి మండల టీడీపీ నేతలు సత్కరించారు. గురువారం పెడనలో శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు బొమ్మిశెట్టి వెంకన్న, రంగిశెట్టి గోవర్ధనరావు, పరసా కృష్ణ, శాయిన రామారావు తదితరులు కృష్ణప్రసాద్‌ను సత్కరించారు.